# తొలివార్త
తెలుగు దిన పత్రిక

RNI : TGTEL/25/A0357

ప్రజా గళం మా కలం.....

www.tolivaartha.com

www.epaper.tolivaartha.com

ప్రచురణ : రంగారెడ్డి ఎడిటర్ : లింగాల నరేందర్ గౌడ్ సంపుటి : 02 సంచిక : 171 మంగళవారం 27 - 10 - 2026 వెల : 4/- పేజీలు : 08

Published From : Rangareddy , Circulated at : Hyderabad, Medchal, Malkajgiri, Suryapet, Nalgonda, Jangaon Khammam, Mahaboobnagar, Narayanpet, Warangal , Mancherial







## ప్రతికూల ప్రభావం లేకపోతే

# తుమ్మిడిహెట్టికి ఓకే

- మహారాష్ట్ర సీఎం సానుకూలం!
- తుమ్మిడిహెట్టిపై తెలంగాణ, మహారాష్ట్ర ముఖ్యమంత్రుల సమావేశం
- ప్రతికూల ప్రభావం లేకపోతే ఓకే
- తుమ్మిడిహెట్టిపై మహారాష్ట్ర సీఎం సానుకూలం!
- తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై ముంబయిలో చర్చలు జరిగాయి
- 152 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి అంగీకారం తెలపాలని సీఎం రేవంత్‌రెడ్డి మహారాష్ట్రను కోరారు



**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 26 :**

తుమ్మిడిహెట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి సంబంధించిన అంశంపై ముంబయి వేదికగా తెలంగాణ, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు సమావేశం జరిగింది. తెలంగాణ నీటి అవసరాలు, వెనుకబడిన ప్రాంత అభివృద్ధి, గిరిజనుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట నిర్మాణానికి సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్రను కోరారు. తమ రాష్ట్రంపై ప్రతికూల ప్రభావం లేకపోతే తుమ్మిడిహెట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి గతంలో కుదిరిన ఒప్పందాన్ని పునఃపరిశీలించేందుకు తమకు అభ్యంతరం లేదని, తెలంగాణ నీటి అవసరాలకు సహకరిస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. కేంద్ర జలసంఘం - మిగతా 2 లో

## రాహుల్ గాంధీకి రేవంత్ రెడ్డి

# ఏటీఎం కార్డులా మారారు



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రాహుల్ గాంధీకి తెలంగాణ ఒక ఏటీఎంగా మారిందన్న కేటీఆర్
- హామీలు గాలికొదిలి కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తోందని విమర్శ
- సీఎం పాలనలో స్కామ్‌లు, అవినీతి పెరిగిపోయిందని ఆరోపణ
- 2028లో కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని కేటీఆర్ ధీమా వ్యక్తం

**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 26 :**

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రాహుల్ గాంధీకి ఒక ఏటీఎంగా మారిందని, ముఖ్యమంత్రి - మిగతా 2 లో



## అధికారానికి దూరమవడంతో

# కాంగ్రెస్‌లో అసహనం

- ప్రధానిపై ఖర్గే వ్యాఖ్యలు
- తీవ్రంగా స్పందించిన రాంచందర్ రావు
- ప్రధాని తండ్రిని ఉద్దేశించి ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు
- తీవ్రంగా ఖండించిన తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు

**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 26 :**

ప్రధాని మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అంతటి సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నేత ఇంత దిగజారుడు - మిగతా 2 లో



## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శుభవార్త

# త్వరలో ఫైనల్ బిల్లులు!

- ఇందిరమ్మ ఇళ్ల పెండింగ్ బిల్లులు త్వరలో జమ
- లబ్ధిదారులు ఆందోళన చెందవద్దన్న మంత్రి పొంగులేటి
- రూ.40 వేల కోట్లతో 8 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యం
- తరువాతి విడతల్లోనూ అర్హులకు ఇళ్ల కేటాయింపు

**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 26 :**

తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. నిర్మాణం పూర్తిచేసుకుని ఫైనల్ బిల్లుల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి త్వరలోనే ఆ మొత్తాన్ని జమ చేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. పాలేరు నియోజకవర్గ పర్యటనలో - మిగతా 2 లో

## రూ.2.12లక్షల కోట్లతో

# డ్రోన్స్, గన్స్, హెలికాప్టర్స్ కొనుగోలు



- డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ ఆమోదం
- రక్షణ రంగానికి భారీ బూస్ట్
- సరికొత్త హెలికాప్టర్లు, కామికాజ్ డ్రోన్ల కోసం రూ.2.12 లక్షల కోట్లు కేటాయించేందుకు కేంద్రం ఆమోదం
- భారత సైన్యం కోసం ఇతర మానవ రహిత వైమానిక వ్యవస్థలు, నిఘా విమానాలు, సమీకృత నిఘా,దాడి వ్యవస్థలు

**తొలివార్త,ఢిల్లీ, అక్టోబర్ 26 :**

రక్షణ దళాల కోసం రూ.2.12 లక్షల కోట్ల విలువైన సైనిక పరికరాలు కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సోమవారం ఆమోదం తెలిపింది. దీనితో తేలికపాటి మల్టీ-రోల్ హెలికాప్టర్లు, - మిగతా 2 లో

## విజయవాడకు

# ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

- ఘన స్వాగతం పలికిన గవర్నర్, మంత్రి లోకేశ్
- ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రూబీ జూబ్లీ వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరు
- ఉపరాష్ట్రపతిని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందించిన మంత్రి లోకేశ్



**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 26 :**

భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ సోమవారం ఆంధ్రప్రదేశ్ పర్యటనకు విచ్చేశారు. ఆయన ప్రత్యేక విమానంలో విజయవాడ సమీపంలోని గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు ఘనంగా స్వాగతం పలికింది. ఉపరాష్ట్రపతికి రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో పాటు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పుష్పగుచ్ఛం అందించి ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గన్నవరం ఎమ్మెల్యే - మిగతా 2 లో

## మలేరియా వ్యాక్సిన్

# ధర 40 శాతం తగ్గింపు

- మరో 10 లక్షల మంది పిల్లలకు రక్షణ!
- ఒక్క డోసు ధర రూ.600 లోపే
- 2027 ప్రారంభం నుంచి కొత్త ధర అమలు
- మూడేళ్లలో 50 మిలియన్ డాలర్ల ఆదా
- మరో 10 లక్షల మంది పిల్లలకు టీకా అవకాశం
- నాలుగు డోసులతో మలేరియా కేసులు తగ్గే అవకాశం
- ఆఫ్రికా దేశాల్లో వ్యాక్సిన్ పంపిణీకి ప్రాధాన్యం






# అవి ఏకగ్రీవాలు కాదు.. కూటమి పార్టీలు చేసిన బలాత్కారాలు

- ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల
- స్థానిక సంస్థల ఏకగ్రీవాలపై షర్మిల ఫైర్
- ఈసీ, పోలీసు వ్యవస్థలను కూటమి నిర్వీర్యం చేసిందని వ్యాఖ్య
- ఏకగ్రీవ ఫలితాలను నిలిపివేసి, విచారణ జరపాలని డిమాండ్

**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 26 :**

రాష్ట్రంలో జరిగిన స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో నమోదైన ఏకగ్రీవాలపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) - మిగతా 2 లో

# తిరుపతిలో డీజీపీ, ఐజీల జాతీయ సదస్సు



- హాజరుకానున్న మోదీ, అమిత్ షా
- డిసెంబర్ 4 నుంచి 6 వరకు తిరుపతిలో డీజీపీ, ఐజీల సదస్సు
- హాజరుకానున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- తిరుపతి ఐసర్‌లో జరగనున్న జాతీయ స్థాయి సమావేశం
- ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష

**తొలివార్త,తిరుపతి, అక్టోబర్ 26 :**

దేశ అంతర్గత భద్రత, శాంతిభద్రతలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించే వార్షిక సదస్సు ఈసారి తిరుపతిలో జరగనుంది. - మిగతా 2 లో



# అర్నబ్ తుపానుపై ఏపీ సర్కార్ హైఅలర్ట్

- ప్రజలకు కీలక సూచనలు
- అర్నబ్ తుపానుపై ఆంధ్రప్రదేశ్ సర్కారు హైఅలర్ట్ ప్రకటించింది
- క్షణక్షణం తుపాను కదలికలపై నిఘా పెట్టి ఎక్కడా ప్రాణనష్టం జరగకుండా పక్కా కార్యాచరణతో ముందుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు
- ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదులుతున్న నేపథ్యంలో రెడ్ అలర్ట్ జారీ
- తీరం దాటే సమయంలో గంటకు 140 కి.మీ. వేగంతో పెనుగాలులు
- తుపాను తీవ్రతను స్పష్టం చేసిన ఇస్రో శాటిలైట్ చిత్రాలు

**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 26 :**

అర్నబ్ తుపానుపై ఆంధ్రప్రదేశ్ సర్కారు హైఅలర్ట్ ప్రకటించింది. క్షణక్షణం తుపాను కదలికలపై నిఘా పెట్టి ఎక్కడా ప్రాణనష్టం జరగకుండా పక్కా కార్యాచరణతో ముందుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. తుపాను ప్రభావం, వర్షాలు, గాలులు, వరద ప్రవాహాల తీవ్రతను అంచనా వేస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని స్పష్టం చేశారు. తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. అర్నబ్ తుపాను ప్రభావం పై ముఖ్యమంత్రి చంద్రబాబు, వివిధ శాఖల మంత్రులు వరుస సమీక్షలు చేపట్టి, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. తుపాను ముప్పును ఎదుర్కొనేందుకు ముందస్తు సన్నద్ధతే కీలకమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గతంలో వచ్చిన తుపాన్ల సమాచారాన్ని విశ్లేషించి, ప్రస్తుత పరిస్థితులతో పోల్చుతూ ప్రమాద తీవ్రతను అంచనా వేయాలని సూచించారు. రైతులకు, ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేయాలని, - మిగతా 2 లో

# సంపాదకీయం

## స్థలకాల సందిగ్ధంలో...

స్థలకాలాలను మనిషి శాసిస్తాడా లేక స్థలకాలాలే మనిషిని శాసిస్తాయా అని అడిగితే ఠక్కున సమాధానం చెప్పడం కష్టం. ఎందుకంటే, సాధారణంగా ఆ అనుశాసనం భార్యా భర్తల సంబంధంలా పరస్పరమవుతుంది; మనిషి స్థలకాలాలను శాసిస్తున్నట్టు కనిపి స్తూనే, స్థలకాలాల శాసనానికి లొంగిపోతూ ఉంటాడు. ఈ క్షణాన ప్రపంచవ్యాప్తంగా అనేక రంగాలలో అదే జరుగుతోంది. ఇంటర్నెట్ వంటి అత్యాధునిక సాంకేతిక సంపత్తి అందుబాటులోకి వచ్చి స్థలకాలాలతో మనిషి సంబంధంలో అనూహ్యమైన వేగమూ, అనేకమైన మార్పులూ తెచ్చి అతణ్ణి అరచేతి బొమ్మలా ఆడిస్తోంది. తను కనిపెట్టిన సాంకేతికత చేతిలో ఒక్కోసారి తనే చిత్తవుతూ మనిషి కళ్ళు తేలేయవలసివస్తోంది. ఎంతమంది గమనించారో కానీ, ఈ అత్యాధునిక సాంకేతికత పుణ్యమా అని కవి, రచయితలతో సహా ఏదో ఒక రచనారంగానికి చెందిన బుద్ధిజీవులందరూ ఈరోజున స్థలకాలసంబంధమైన ఒక సమస్యను ఎదుర్కొంటున్నారు. ఒక రచన ఆక్రమించుకునే జాగాను ఇక్కడ స్థలమనుకుంటే, ఆ రచన పాఠకులు, లేదా శ్రోతలముందుకు రావడానికి పట్టే సమయాన్ని కాలమనుకుందాం. లిపీ, లేఖనం అభివృద్ధి చెందని మౌఖిక సంప్ర దాయపు రోజుల్లో కవీ లేదా కథకుడూ-- శ్రోతలూ ఎదురెదురుగా ఉండేవారు కనుక స్థల కాలసంబంధమైన అంతరాలు ఉండేవికావు. లేఖన సంప్రదాయం వచ్చి, తాళపత్రాల దశను కూడా దాటి కాగితం మీద రాయడమూ, ముద్రించడమూ, ఆపైన పత్రికలూ వచ్చాక కాగితం మీద ఆ రచన ఆక్రమించుకునే నిడివి రూపంలో స్థలమూ, పాఠకులకది చేరే వ్యవధి రూపంలో కాలమూ ప్రముఖంగా అడుగుపెట్టాయి. ఇలాంటి లేఖనసంప్రదాయం తాళపత్రాలతో మొదలుపెట్టి, వందల సంవత్సరాల పాటు కొనసాగిన తర్వాత మళ్ళీ మనం స్థలకాల అంతరాలకు అవకాశం లేని వెనకటి మౌఖిక సంప్రదాయపు రోజులకు చేరుకున్నాం! ఎలాగంటే, ఆ సంప్రదాయంలో కవులూ, కథకులూ తమ రచనను శ్రోతలకు తక్షణమే అందించినట్టుగా ఈరోజున ఇంట ర్నెట్ ఆధారిత సామాజిక మాధ్యమాల్లో రచయితలు తమ రచనలను పాఠకులకు తక్షణమే అందించగలుగుతున్నారు; దానికి తోడు, లేఖన, ముద్రణానుభవాలకుభిన్నంగా ఈ మాధ్యమాల్లో స్థలపరిమితులు కూడా పూర్తిగా మాయమవుతున్నాయి. ఈవిధంగా రచనాకాలచక్రం చిత్రంగా తిరిగి బయలు దేరినచోటికే వచ్చింది! మారిన ఈ పరిస్థితికి అనుగుణంగా తాము మారి, తమ రచనలను ఎలా మలచు కోవాలన్నదే ఈ రోజున ఎంతోమంది రచయితలు అప్రకటితంగా ఎదుర్కొంటున్న సమస్య. ఉదాహరణకే చూడండి, ఆయా రచనాప్రక్రియల్లో చేయి తిరిగినవారిలో అనేకులు నిన్నటివరకూ దిన, వార, మాస పత్రికలు నిర్దేశించిన స్థలకాలపరిమితులకూ, ప్రమాణాలకూ లోబడి రాయడానికి అలవాటుపడినవాళ్ళు; అలాగే తమ రచన పాఠకు లకు చేరేందుకు పట్టే వ్యవధికీ మానసికంగా సిద్ధమై ఉండేవారు. నేరుగా పుస్తకరూపంలో తమ రచనల్ని ముద్రించుకునేవారూ దాదాపు ఈ కోవలోకే వస్తారు.కానీ ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల వ్యాప్తితో స్థలకాలపరిమితులే కాక, ప్రమాణాలను నిర్దేశించుకుని పరిష్కరణ బాధ్యత వహించే సంపాదకవర్గం కూడా మటుమాయమై ప్రతి రచయితా, కవీ, కథకుడూ తన 'గోడ'కు తనే యజమానిగా, సంపాదకుడిగా అదనపు బాధ్యతలను మోయవలసివస్తోంది. రచన చేయడానికే తప్ప పాఠకులకు దానిని చేర్చడానికి పట్టే వ్యవధి క్షణాలకు కుదించుకుపోవడం ఒక సానుకూల పరిణామనుకున్నా, స్థలపరి మితులు మాయమైపోయిన స్థితిలో పాఠకుల సహనమే కొలమానంగా పరిమితులను నిర్ణయించుకోవలసిన బాధ్యతా రచనాకారులపైనే పడుతోంది. అంతేకాదు, పత్రికలవంటి మాధ్యమాలు నిర్దేశించిన చట్రంనుంచి రచనలు తప్పుకుని వస్తురూపాలూ, అభివ్యక్తుల పరంగా కొత్తరూపాలు ధరించడమూ జరుగుతోంది.

## విజయవాడకు ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

**మొదటిపేజీ తరువాయి -** యార్లగడ్డ వెంకట్రావు, పలువురు ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. అనంతరం మంత్రి నారా లోకేశ్ ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ను శాలువాతో సత్కరించి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక ప్రత్యేక జ్ఞాపికను బహూకరించారు.విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో జరగనున్న డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 40వ వార్షికోత్సవ (రూబీ జూబ్లీ) వేడుకల్లో ఉపరాష్ట్రపతి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం ఆయన మధ్యాహ్నం తిరుపతికి బయలుదేరి వెళ్లనున్నారు.

## తిరుపతిలో డీజీపీ, ఐజీల జాతీయ సదస్సు

**మొదటిపేజీ తరువాయి -** దేశంలోని అన్ని రాష్ట్రాల డీజీపీలు, ఐజీలతో పాటు కేంద్ర పోలీస్ సంస్థల అధిపతులు పాల్గొనే ఈ జాతీయ స్థాయి సమావేశానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరుకానున్నారు. డిసెంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ప్రాంగణంలో ఈ సదస్సు జరగనుంది. ఈ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా సోమవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జి. సాయిప్రసాద్ సంబంధిత శాఖల అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధాని, కేంద్ర హోంమంత్రి సహా దేశంలోని పోలీసు ఉన్నతాధికారులందరూ హాజరవుతున్నందున, భద్రత, వసతి, రవాణా తదితర అంశాల్లో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖ తమకు కేటాయించిన బాధ్యతలను సమన్వయంతో పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్, అదనపు డీజీపీ మధుసూదన్ రెడ్డి, జీఏడీ ముఖ్య కార్యదర్శి జె. శ్యామల రావు, ఐపీఎస్ అధికారి కాంతి రాణా టాటా, ఎస్ఐబీ డిప్యూటీ డైరెక్టర్ అంబిక తదితరులు పాల్గొన్నారు. అలాగే, తిరుపతి కలెక్టర్ డా. వెంకటేశ్వర్, ఎస్పీతో పాటు ఇతర అధికారులు వర్చువల్ విధానంలో పాలుపంచుకున్నారు.

## రాహుల్ గాంధీకి రేవంత్ రెడ్డి ఏటీఎం కార్డులా మారారు

**మొదటిపేజీ తరువాయి -** రేవంత్ రెడ్డి ఏటీఎం కార్డులా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో వరుస కుంభకోణాలు, అవినీతి జరుగుతున్నా రాహుల్ గాంధీ మౌనంగా ఉండటానికి కారణం.. ఇక్కడి నుంచి ఆయనకు ముడుపులు అందుతుండటమేనని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన మైనారిటీ నాయకుడు జిబ్రాన్ షరీఫ్, తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు.దేశమంతా తిరుగుతూ 'ఛాత్రోంకీ గూంజ్' అంటూ ఉపన్యాసాలిచ్చే రాహుల్ గాంధీకి తెలంగాణలో అడుగుపెట్టే ధైర్యం లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు 420 హామీలిచ్చి, వెయ్యి రోజులు గడుస్తున్నా వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. "రాహుల్ గాంధీ అడ్రస్ లేకుండా పోయారు. తెలంగాణలో ఏం జరుగుతుందో ఆయనకు పట్టడం లేదు. ఎందుకంటే ఆయనకు అందాల్సినవి అందుతున్నాయి. అందుకే ఇక్కడి స్కామ్‌లపై, ప్రభుత్వ వైఫల్యాలపై నోరు మెదపడం లేదు" అని కేటీఆర్ ఆరోపించారు.ఎన్నికలకు ముందు హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో టీ స్టాల్ వద్ద కూర్చొని నిరుద్యోగ యువతకు ఉద్యోగాల గురించి భరోసా ఇచ్చిన రాహుల్ గాంధీ, ఇప్పుడు వారిని పూర్తిగా విస్మరించారని అన్నారు. మైనారిటీల కోసం ప్రత్యేక డిక్లరేషన్ ప్రకటించి, సంక్షేమానికి రూ.4,000 కోట్లు కేటాయిస్తామన్న హామీని గాలికొదిలేశారని విమర్శించారు. ఆసరా పెన్షన్‌ను రూ.4,000కు పెంచుతామని, రైతులకు ఎకరానికి రూ.15,000 ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి, ఇప్పుడు మాట తప్పారని మండిపడ్డారు.ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సింది పోయి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిట్లతో, అక్రమ కేసులతో బెదిరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలనలో వరుస కుంభకోణాలు వెలుగులోకి వస్తున్నాయని, ముఖ్యంగా ఆయన కుటుంబ సభ్యులకు సంబంధించిన భూ వ్యవహారాలు అనుమానాస్పదంగా ఉన్నాయని అన్నారు. "సుమారు రూ.200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని కేవలం రూ.7 కోట్లకే తన తమ్ముడికి కట్టబెట్టారు. అమెరికాలో ఉంటున్న మరో సోదరుడికి సంబంధించిన రూ.1,000 కోట్ల డీల్‌పై కూడా అనేక అనుమానాలు ఉన్నాయి. వీటిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెల్లడించాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య మతపరమైన విభజనలు సృష్టిస్తుంటే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటుందని కేటీఆర్ అన్నారు. దేశంలో ప్రధాని మోదీని ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్‌కు లేదని, తెలంగాణ ప్రయోజనాలను కాపాడే ఏకైక శక్తి బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని తెలిపారు. "ఇంకో ఏడాదిన్నరలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం. 2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు. తెలంగాణను తిరిగి దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం" అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

## అధికారానికి దూరమవడంతో కాంగ్రెస్‌లో అసహనం

**మొదటిపేజీ తరువాయి -**

భాష మాట్లాడటం అత్యంత విచారకరమని అన్నారు.హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన రాంచందర్ రావు... గత పన్నెండున్నర ఏళ్లుగా అధికారానికి దూరంగా ఉండటంతో కాంగ్రెస్ నేతల్లో తీవ్రమైన అసహనం కనిపిస్తోందని విమర్శించారు. ఆ నిరాశా నిస్పృహల నుంచే మోదీ తండ్రిని కూడా నిందిస్తూ ఖర్గే వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఖర్గే మాట్లాడిన సభలో వేదికపై ఉన్న నేతల కంటే కింద ఉన్న ప్రేక్షకులు చాలా తక్కువగా ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు.బీహార్‌లోని పాట్నాలో నిన్న జరిగిన ఓ కార్యక్రమంలో మల్లికార్జున ఖర్గే ప్రసంగిస్తుండగా... ఓ వ్యక్తి మోదీ ఓడిపోరంటూ నినాదాలు చేశారు. దీనికి స్పందించిన ఖర్గే.. 'మోదీ కా బాప్ భీ జాయేగా' (మోదీ అబ్బ కూడా దిగిపోవాల్సిందే) అంటూ వ్యాఖ్యానించారు.ఈ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ నేతలు ఖర్గే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై పాట్నాలోని పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నేతలు ఫిర్యాదు కూడా చేశారు. దీంతో ఈ వివాదం మరింత ముదిరింది.

# అర్నబ్ తుపానుపై ఆంధ్రప్రదేశ్ సర్కార్ హైఅలర్ట్

**మొదటిపేజీ తరువాయి -** తీర ప్రాంత ప్రజలను తుపాను షెల్టర్లకు తరలించే ప్రక్రియను పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఆర్టీజీఎస్, విపత్తు నిర్వహణ శాఖల అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు.తుపాను కదలికలు, తీరం దాటే అంచనాలపై హోంమంత్రి అనిత వివరాలు వెల్లడించారు. అర్ధరాత్రికి తుపాను తీవ్రంగా, రేపటికి అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని తెలిపారు. ఎల్లుండి ఉదయం బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశముందని, గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచవచ్చని వివరించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని సూచించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని, అధికారిక సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని స్పష్టం చేశారు. తుపాను కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే పునరుద్ధరణకు వెంటనే చర్యలు చేపట్టాలని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. అవసరమైన సిబ్బందిని, పరికరాలను సిద్ధంగా ఉంచాలని, విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సి వస్తే వినియోగదారులకు ముందుగానే సమాచారం అందించాలని సూచించారు.సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, నదులు, కాలువల వద్ద నీటి మట్టాలు, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లోలను నిరంతరం పర్యవేక్షించాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. వరద ముప్పున్న ప్రాంతాలను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని, నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించాలని సూచించారు. ఎన్టీఆర్ జిల్లాలోని బుడమేరు కాలువ, ఏలేరు రిజర్వాయర్ పరివాహక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పనులకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ పద్ధతుల్లో పనులు కొనసాగిస్తూ, 2027 మార్చి నాటికి పూర్తి చేసే లక్ష్యంతో ముందుకెళ్లాలని స్పష్టం చేశారు. రహదారులపై చెట్లు కూలినా, రాకపోకలకు అంతరాయం కలిగినా వెంటనే స్పందించేలా యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. ప్రమాదకర వంతెనలు, కల్వర్టుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని, అవసరాన్ని బట్టి ట్రాఫిక్‌ను నియంత్రించాలని సూచించారు. ఇంజినీరింగ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, కలెక్టర్లు, పోలీసులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. సంబంధిత అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.పంట నష్టాన్ని తగ్గించేందుకు రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. వాతావరణం అనుకూలించినప్పుడు కోతకు సిద్ధంగా ఉన్న వరి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, మినుము, పెసర, కంది పంటలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. ధాన్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తులపై టార్పాలిన్లు కప్పాలని, పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా మురుగు కాలువలను శుభ్రం చేయాలని ఆదేశించారు. వర్షాలు పడే సమయంలో యూరియా, పైపాటుగా వేసే ఎరువుల వినియోగాన్ని వాయిదా వేయాలని స్పష్టం చేశారు. ఉద్యాన పంటలకు నష్టం కలగకుండా అరటి, బొప్పాయి మొక్కలకు ఆసరా ఏర్పాటు చేయాలని, పందిరి పంటల నిర్మాణాలను బలోపేతం చేయాలని అచ్చెన్నాయుడు సూచించారు. పశువులు, కోళ్లు ఉండే షెడ్లలోకి నీరు చేరకుండా చూడాలని, ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, మోటార్లు, డ్రిప్ పరికరాలను సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలని తెలిపారు. తుపాను తర్వాత పంటలకు తెగుళ్లు, వ్యాధులు సోకకుండా వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు.తుపాను వేళ ప్రజలు విద్యుత్ స్తంభాలు, తెగిపడిన తీగలు, చెట్లు, హోర్డింగులు, బలహీనమైన భవనాలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించేవారు అధికారుల సూచనల మేరకు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా ఉండటంతో పాటు ఇప్పటికే సముద్రంలో ఉన్న బోట్లు సురక్షిత తీరానికి చేరుకోవాలని హెచ్చరించారు. తుపాను అనంతరం పంటలు, పశువులు, వ్యవసాయ పరికరాలకు జరిగిన నష్టాన్ని నమోదు చేసి సంబంధిత అధికారులకు తెలియజేయాలని, బీమా క్లెయిమ్‌లకు అవసరమైన ఆధారాలను భద్రపరచుకోవాలని సూచించారు. తాగునీటిని కాచి చల్లార్చి తీసుకోవాలని, అన్ని వేళలా ప్రాణ రక్షణకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

## అవి ఏకగ్రీవాలు కాదు.. కూటమి పార్టీలు చేసిన బలాత్కారాలు

**మొదటిపేజీ తరువాయి -** అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇవి ప్రజల ఆమోదంతో జరిగిన ఏకగ్రీవాలు కావని, అధికార మదంతో కూటమి పార్టీలు చేసిన బలాత్కారాలని ఆమె ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆమె సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. అధికార కూటమి అరాచకాలకు ఈ ఏకగ్రీవాలు నిదర్శనమని, ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని తీవ్రంగా విమర్శించారు.షర్మిల తన ప్రకటనలో, "రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను 'కూటమి కమిషన్'గా మార్చారు. నడిరోడ్డుపై రాజ్యాంగాన్ని ఖూనీ చేసి, పోలీసు వ్యవస్థను బానిసగా మార్చి, ప్రతిపక్ష అభ్యర్థుల పత్రాలు చించివేసి, వారిని భయభ్రాంతులకు గురిచేశారు. రక్తపాతంతో ప్రజాస్వామ్యాన్ని కాలరాసిన ఘనత కూటమి పార్టీలది" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో 16 మున్సిపాలిటీలు, 639 వార్డులు, 4 జెడ్పీటీసీలు, 32 ఎంపీటీసీ స్థానాల్లో జరిగినవి ఏకగ్రీవాలు కాదని, కూటమి సృష్టించిన భయోత్పాతానికి నిదర్శనాలని ఆమె అన్నారు. ఇది ప్రభంజనం కాదని, కూటమి రాజకీయ నిస్తేజమని అభివర్ణించారు.గత వైసీపీ ప్రభుత్వంతో పోలుస్తూ షర్మిల, కూటమి ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. "ఆనాడు వైసీపీ చేసిందని నేడు మీరు చేస్తారా? వాళ్లు గడ్డి తిన్నారని, మీరు అదే తింటారా? కూటమి ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం లేదా? బలవంతపు ఏకగ్రీవాల పేరుతో ఈ విచక్షణా రాహిత్యం ఎందుకు?" అని ఆమె ప్రభుత్వాన్ని నిలదీశారు.ఈ బలవంతపు ఏకగ్రీవాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన షర్మిల డిమాండ్ చేశారు. ఏకగ్రీవాల ఫలితాలను నిలిపివేసి, పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కోరారు. ఈ విషయంలో ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజల హక్కులను కాపాడాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## రూ.2.12లక్షల కోట్లతో డ్రోన్స్, గన్స్, హెలికాప్టర్స్ కొనుగోలు

**మొదటిపేజీ తరువాయి -** లాంగ్-రేంజ్ కామికాజ్ డ్రోన్లు సహా సైనిక ప్లాట్‌ఫారమ్‌లు, ఆయుధాలు కొనుగోలు చేసేందుకు వీలవుతుంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన డీఏసీ (డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్) ఈ కొనుగోలు ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది.రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకారం, భారత సైన్యం కోసం హై మొబిలిటీ వాహనాలు, సెల్ఫ్-ప్రొపెల్డ్ ట్రాక్డ్‌గన్ సిస్టమ్, తేలికపాటి మల్టీ-రోల్ హెలికాప్టర్లు, స్వల్ప శ్రేణి వాయు రక్షణ వ్యవస్థ, కౌంటర్ అన్‌మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్ (సీ-యూఏఎస్) కొనుగోలుకు ఆమోదం లభించింది. అలాగే భారత సైన్యం కోసం ఇతర మానవ రహిత వైమానిక వ్యవస్థలు, నిఘా విమానాలు, సమీకృత నిఘా, దాడి వ్యవస్థలు, లాంగ్-రేంజ్ కామికాజీ డ్రోన్ వ్యవస్థలు కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. మరోవైపు భారత నౌకాదళం కోసం యాక్టివ్ ఆఫ్‌బోర్డ్ డెకాయ్ సిస్టమ్ ఇతర ప్రధాన నౌకాదళ ప్లాట్‌ఫారమ్‌ల కొనుగోలుకు కూడా ఆమోదం లభించింది. అలాగే భారత వైమానిక దళం కోసం హెలికాప్టర్లు, వాయు రక్షణ వ్యవస్థలు, రాడార్ల సేకరణకు డీఏసీ ఆమోదం తెలిపింది. కాగా, ఈ రక్షణ పరికరాల్లో దాదాపు 82 శాతం భారత పరిశ్రమల నుంచే కొనుగోలు చేయనున్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శుభవార్త.. త్వరలో ఫైనల్ బిల్లులు!

**మొదటిపేజీ తరువాయి -** భాగంగా ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఇల్లు పూర్తయినా ఫైనల్ బిల్లు ఇంకా రాలేదని లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు.రాష్ట్రంలోని నిరుపేదలకు పక్కా గృహాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున, మొత్తం రూ.40 వేల కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించిందని పేర్కొన్నారు.మొదటి విడతలో ఇళ్లు మంజూరు కాని అర్హులైన పేదలు నిరాశ చెందవద్దని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రభుత్వం దశలవారీగా ఈ పథకాన్ని అమలు చేస్తుందని, మూడు, నాలుగో విడతల్లో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి ప్రకటనతో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని, తుది చెల్లింపుల కోసం ఎదురుచూస్తున్న వేలాది పేద కుటుంబాల్లో ఆశలు చిగురించాయి. త్వరలోనే తమ ఖాతాల్లోకి డబ్బులు జమ అవుతాయన్న నమ్మకం వారిలో వ్యక్తమవుతోంది.

## మలేరియా వ్యాక్సిన్ ధర 40 శాతం తగ్గింపు

**మొదటిపేజీ తరువాయి -** మలేరియా మహమ్మారి నుంచి చిన్నారులను రక్షించేందుకు భారత్ బయోటెక్ కీలక ముందడుగు వేసింది. అంతర్జాతీయ సంస్థలు 'గవి', 'యునిసెఫ్'తో కలిసి మలేరియా వ్యాక్సిన్ ధరను దాదాపు 40 శాతం తగ్గించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో ప్రస్తుతం ఒక్క డోసుకు 9.30 యూరోలుగా ఉన్న ధర 5.50 యూరోలకు తగ్గనుంది. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.600 లోపే ఉంటుంది. ఈ తగ్గింపు 2027 ప్రారంభం నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ఈ నిర్ణయంతో 2027-2029 మధ్య చిన్నారుల టీకా కార్యక్రమాలకు దాదాపు 50 మిలియన్ డాలర్లు ఆదా కానున్నాయి. ఈ నిధులతో మరో 10 లక్షల మంది పిల్లలకు మలేరియా వ్యాక్సిన్ అందించవచ్చని అంచనా. భారత్ బయోటెక్ ఈ వ్యాక్సిన్‌ను 'మాస్కివాక్' పేరుతో తయారు చేస్తోంది. దీని అసలు పేరు ఆర్టీఎస్, ఎస్/ఏఎస్01. జీఎస్కే, పాత్ సంస్థలు, వాటి భాగస్వాములు అభివృద్ధి చేసిన ఈ వ్యాక్సిన్‌ను 2021లో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) చిన్నారుల్లో మలేరియా నివారణ కోసం విస్తృత వినియోగానికి సిఫారసు చేసింది. ప్రస్తుతం దీని తయారీ బాధ్యతలను జీఎస్కే నుంచి భారత్ బయోటెక్‌కు బదిలీ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచి, మరిన్ని దేశాలకు వ్యాక్సిన్ అందుబాటులోకి తీసుకురావడం దీని ప్రధాన లక్ష్యం.ఈ వ్యాక్సిన్‌ను నాలుగు డోసుల కోర్సుగా ఇస్తారు. మలేరియా వ్యాప్తి కాలానుగుణంగా ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సరైన సమయంలో నాలుగు డోసులు తీసుకుంటే మలేరియా కేసులు సుమారు 75 శాతం తగ్గే అవకాశం ఉందని యునిసెఫ్ తెలిపింది. అయితే, ఈ వ్యాక్సిన్ పూర్తిస్థాయి రక్షణ ఇవ్వదు. దోమతెరలు వాడటం, దోమల నియంత్రణ చర్యలు చేపట్టడం, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం కూడా అవసరం.ప్రపంచవ్యాప్తంగా 2024లో సుమారు 28.2 కోట్ల మలేరియా కేసులు నమోదయ్యాయి. ఈ వ్యాధితో 6.10 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో అత్యధిక మరణాలు ఆఫ్రికాలోనే సంభవించాయి. ఆ ప్రాంతంలో ఐదేళ్లలోపు చిన్నారులే ఎక్కువగా మృత్యువాత పడుతున్నారు. ప్రస్తుతం 25 ఆఫ్రికా దేశాల్లో సాధారణ టీకా కార్యక్రమాల్లో మలేరియా వ్యాక్సిన్‌ను చేర్చారు. యునిసెఫ్ ఇప్పటివరకు 7.4 కోట్లకు పైగా డోసులను సేకరించి పంపిణీ చేసింది.

# ప్రతికూల ప్రభావం లేకపోతే తుమ్మిడిహెట్టికి ఓకే



**మొదటిపేజీ తరువాయి -** అధ్యయనంతో పాటు రెండు రాష్ట్రాల అధికారులతో కూడిన కమిటీ అన్ని అంశాలను పరిశీలించాలని ప్రతిపాదించారు. ముంపు, ప్రభావిత ప్రాంతానికి సంబంధించి ప్రత్యామ్నాయాలను కూడా అధ్యయనం చేయాలని సూచించారు.తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట నిర్మాణానికి సంబంధించిన అంశాలపై ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్ హౌస్ వేదికగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం సమావేశమైంది. రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.తుమ్మిడిహెట్టి ఆనకట్ట ఎత్తు పెంపు అంశంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్?తో చర్చలు చాలా ఫలవంతంగా ముగిశాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం అనంతరం ఎక్స్ వేదికగా స్పందించిన రేవంత్ రెడ్డి తమ ప్రతిపాదనను పెద్ద హృదయంతో పరిశీలించారని ఫడణవీస్?కు కృతజ్ఞతలు చెప్పారు. సాంకేతిక అంశాలతో పాటు ముంపు అంశాలపై అధ్యయనం చేసేందుకు అధికారుల కమిటీ ఏర్పాటు చేసేందుకు ఇరువైపులా అంగీకారం కుదిరిందని అన్నారు. మహారాష్ట్ర, అక్కడి ప్రజల ప్రయోజనాలను పరిగణలోకి తీసుకుంటూనే జాతీయ దృక్పథంతో ఆదిలాబాద్ జిల్లా ప్రజలు, ప్రత్యేకించి గిరిజనుల జీవితాలను మార్చేందుకు తన వంతు సహకరిస్తానని ఫడణవీస్ హామీ ఇచ్చినట్లు రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రతిపాదనలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజెంటేషన్ ఇచ్చారని తెలిపారు.రాష్ట్ర ప్రతిపాదనపై మహారాష్ట్ర సీఎం సానుకూలంగా స్పందించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. సమావేశం ప్రారంభంలో ప్రజెంటేషన్ ఇచ్చిన మంత్రి ఉత్తమ్ తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి, గిరిజనుల జీవన పరిస్థితులు, ఆర్థిక వెనుకబాటుతనాన్ని ప్రస్తావించిన ఆయన సుసంపన్నమైన చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉన్నప్పటికీ అభివృద్ధిలో వెనుకబడిపోయిందని తెలిపారు. గిరిజనులు, ఆదివాసీలకు అభివృద్ధి ఫలాలు అందలేదన్నారు. ఆర్థిక అవకాశాలు లేకపోవడం, వెనుకబాటుతనం కారణంగా గతంలో నక్సలిజం వంటి సమస్యలు తలెత్తిన పరిస్థితులను పేర్కొన్నారు.ఆదిలాబాద్ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు 1975 అక్టోబర్ 6న అప్పటి ముఖ్యమంత్రులు జలగం వెంగళరావు, ఎస్బీ చవాన్ మధ్య కుదిరిన ఒప్పందం నుంచి వివిధ దశల్లో ప్రయత్నాలు సాగుతున్నాయని అన్నారు. ఐదు దశాబ్దాలుగా అనేక ప్రతిపాదనలు, చర్చలు జరిగినప్పటికీ ఆశించిన పురోగతి లేదని తెలిపారు. 2016లో తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయిస్తూ ఒప్పందం కుదిరిందన్న ఆయన ఆ ఎత్తుతో నిర్మిస్తే తెలంగాణ ప్రాంత తాగు, సాగునీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని వివరించారు.ప్రాజెక్టు నిర్వహణ వ్యయం కూడా ముఖ్యమైన అంశమని, గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట నిర్మించడమే అత్యంత ప్రయోజనకరమని వివరించారు. సాంకేతిక, నిర్వహణ, ఆర్థిక అంశాల పరంగా ఈ ప్రతిపాదనకు ఉన్న ప్రాధాన్యాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అక్కడ అమల్లో ఉన్న భూసేకరణ నిబంధనలు, ఆ రాష్ట్ర పరిహార విధానం ప్రకారం రైతులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు.తెలంగాణ-మహారాష్ట్ర మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను గుర్తుచేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్వ హైదరాబాద్ సంస్థానంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలకు ఉన్న చారిత్రక అనుబంధాన్ని ప్రస్తావించారు. వెనుకబడిన అటవీ ప్రాంతమైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనులు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పేర్కొన్నారు. కుమురం భీం సాగించిన జల్, జంగిల్, జమీన్ పోరాట కాలం నుంచి ఆ ప్రాంత ప్రజలు సాగు, తాగునీటి సదుపాయాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు.దశాబ్దాలుగా వారి ఆకాంక్షలు నెరవేరలేదన్న రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ గిరిజనులు, ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందని అన్నారు. వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రెండు రాష్ట్రాలు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని కోరారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయం అందుబాటులోకి వస్తే ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ఊతమిస్తుందని మహారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాలకూ ప్రయోజనం కలుగుతుందని వివరించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదన్నా సీఎం రెండు రాష్ట్రాలను భౌతికంగా అనుసంధానించే వారధిగా కూడా నిలుస్తుందని తెలిపారు. వెనుకబడిన ప్రాంత అభివృద్ధి, గిరిజనుల సంక్షేమానికి రెండు రాష్ట్రాల సహకారం అవసరమన్న ఆయన పరస్పర ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సహకరించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు.రాష్ట్ర ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించిన దేవేంద్ర ఫడణవీస్ తెలంగాణతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు. సరిహద్దులోని ఆదిలాబాద్ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందని తన అమ్మమ్మ తెలుగు మాట్లాడతారని ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి ఆనకట్ట ఎత్తు పెంచాలన్న తెలంగాణ అభ్యర్థనను మరోమారు పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని మహారాష్ట్ర సీఎం తెలిపారు. అయితే, తుది నిర్ణయానికి వచ్చే ముందు పలు అంశాలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని సాంకేతిక, పర్యావరణ, పరిపాలనాపరమైన అంశాలను పరిశీలించాలని స్పష్టం చేశారు.మహారాష్ట్రకు, తమ ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల ఎత్తు ఒప్పందాన్ని పునఃపరిశీలించేందుకు అభ్యంతరం లేదని ఫడణవీస్ తెలిపారు. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. స్నేహభావం, సోదరభావంతో మంచి పొరుగు రాష్ట్రాలుగా ముందుకు వెళ్లాలని అభిప్రాయపడ్డారు. గతంలో ఇతర రాష్ట్రాలతో మహారాష్ట్ర పలు అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించుకుందని గుర్తుచేశారు.పరస్పర చర్చలు, సహకారంతో ఆయా సమస్యలకు పరిష్కారం కనుగొన్నామని వివరించారు. తుమ్మిడిహెట్టి ఆనకట్ట విషయంలో కేంద్ర జలసంఘం తన పరిధిలో అవసరమైన అధ్యయనాలు చేపడుతుందని, సాంకేతిక పరిశీలనలు కొనసాగిస్తుందని అన్నారు. ఈలోపు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యతపై కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాలని మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలను పరిశీలించాలని అన్నారు. పరిహారం, ఇతర సాంకేతిక అంశాలను కూడా అధ్యయనం చేయాలని చెప్పారు. తదుపరి సమావేశాల నిర్వహణ, కాలపరిమితులను నిర్ణయించి ప్రాజెక్టుపై ముందుకు వెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని తెలిపారు.దేశంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఇరువురు ముఖ్యమంత్రులు తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని గిరిజనులు, ఆదివాసీలు, అభివృద్ధి అవకాశాలు అందని వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్?లో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్?కు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్?ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. ఆహ్వానంపై సానుకూలంగా స్పందించిన ఫడ్నవీస్ సదస్సులో పాల్గొనేందుకు ఆసక్తి ఉందని, హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు.

తొలివార్త
RNI : TGTEL/25/A0357
www.tolivaartha.com
www.epaper.tolivaartha.com



## ఉచిత నమోదు కేంద్రం గణేష్ టెంపుల్ సూపర్ బజార్ ప్రాంతంలో ప్రారంభం

**అర్హులైన పట్టబద్రులు ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోండి జనసేన పార్టీ పిలుపు**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 26 ( తొలివార్త ):** కొత్తగూడెం నియోజకవర్గం లోని లక్ష్మీదేవి పల్లి మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల ఉచిత నమోదు కేంద్రాన్ని జనసేన పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఖమ్మం వరంగల్ నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తెలంగాణ రాష్ట్ర మాజీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, పుదారి శ్యామ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది రేపు మంగళవారం గణేష్ టెంపుల్ ఏరియాలో బుధవారం సూపర్ బజార్లో నిర్వహించడం జరుగుతున్నది. అని వారు తెలిపారు. అలాగే గత మూడు రోజులుగా కోర్టు లైబ్రరీలో కూడా గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు కార్యక్రమం జరుగుచున్నది ఈ,అవకాశాన్ని, గ్రాడ్యుయేట్, వారందరూ, వినియోగించుకోవలసిందిగా వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పుదారి శ్యామ్, జివిఆర్ ప్రసాద్ కరుణాకర్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోండి కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి

**మండల కాంగ్రెస్ యువజన ప్రెసిడెంట్ మాజీ ఉప సర్పంచ్ బూరక అశోక్ పిలుపు**



**అశ్వాపురం అక్టోబర్ 26 ( తొలివార్త ):** అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ యువజన ప్రెసిడెంట్, మాజీ ఉప సర్పంచ్ బూరక అశోక్,ఎలకలగూడెం గ్రామంలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ,ఖమ్మం వరంగల్ నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హత ఉన్న ప్రతి గ్రాడ్యూయేట్, తప్పనిసరిగా ఓటరుగా నమోదు,చేసుకోవాలని కోరారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకు నేందుకు అర్హులైన గ్రాడ్యుయేటర్లు,వచ్చే నెల నవంబరు 6 చివరి తేదీ వరకు అర్హులైన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని మాజీ ఉపసర్పంచ్ బూరక అశోక్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియలో పట్టబద్రుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు దాన్ని బాధ్యతగా వినియోగించుకోవాలని, ఖమ్మం వరంగల్ నల్గొండ జిల్లాలలో, కాంగ్రెస్ ,పార్టీ, ఎమ్మెల్సీ అభ్యర్థి, గా,నిలబడ్డ, రాం రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ని, అత్యధిక,మెజార్టీతో,గెలిపించుకోవాలని, బి.అశోక్ పట్టభద్రులకు,విజ్ఞప్తి చేశారు.ఉన్నత విద్యను పూర్తి చేసిన పట్టభద్రులు తమ ఓటు హక్కును ఫాం -18 ద్వారా 2023 నవంబర్ నాటికి డిగ్రీ,లేదా దానికి సమానమైన డిప్లొమా పూర్తి చేసిన వారు ఓటరుగా నమోదు వచ్చే నెల నవంబర్ 6 చివరి తేదీ లోగా.ఓటర్ ఐడి కార్డు,ఆధార్ కార్డు,డిగ్రీ / గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్,పాస్పోర్ట్ సైజ్ ఫోటో,మొబైల్ నంబర్ తో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మాజీ ఉపసర్పంచ్ మండల యువజన కాంగ్రెస్ ప్రెసిడెంట్ బూరక అశోక్ పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు.

## చౌటుప్పల్ పట్టణ నూతన సీఐగా డి.సతీష్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

**రూరల్ సర్కిల్ నుండి టౌన్ పీఎస్ కు బదిలీ**

**ఐజీ ఉత్తర్వుల మేరకు బదిలీలు**




**చౌటుప్పల్, అక్టోబర్ 26 ( తొలివార్త ):** చౌటుప్పల్ పట్టణ నూతన సీఐగా డి.సతీష్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.ఇప్పటి వరకు చౌటుప్పల్ రూరల్ సర్కిల్ లో సీఐగా విధులు నిర్వహిస్తున్న సతీష్ రెడ్డి,మల్టీ జోన్-×× ఐజీ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు చౌటుప్పల్ టౌన్ పీఎస్ సీఐగా బాధ్యతలు చేపట్టారు.ఈ బదిలీలో భాగంగా ప్రస్తుత టౌన్ సీఐ జి.మన్మథ కుమార్ రూరల్ సర్కిల్ కు బదిలీ అయ్యారు.పరస్పర బదిలీల్లో భాగంగా సతీష్ రెడ్డి టౌన్ బాధ్యతలు చేపట్టారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని,ప్రజలకు అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా సిఐ సతీష్ రెడ్డి తెలిపారు.

## పోలీస్ స్టేషన్లో నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన శివరామకృష్ణ



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 26 ( తొలివార్త ):** అశ్వాపురం పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా శివరామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐ ఎల్లయ్య ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఎస్సై శివరామకృష్ణ కొన్ని నెలలుగా అశ్వాపురం ఎస్సైగా విధులు నిర్వహించిన రాజేష్ భద్రాచలం టౌన్‌కు బదిలీ అయ్యారు.ఆ స్థానంలో బాధ్యతలు స్వీకరించిన నూతన ఎస్సై శివరామకృష్ణ, ఆయనకు పోలీస్ సిబ్బంది స్వాగతించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## బస్సు కండక్టర్ ప్రమాద ఘటనపై నిందితురాలు మౌనిక అరెస్టు



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 26 ( తొలివార్త ):** అశ్వాపురం మండలంలోని మిట్టగూడెం గ్రామానికి చెందిన బానోత్ మౌనిక ఆదివారం,25 తేదీన, జరిగిన ఆర్టీసీ బస్సులో టికెట్ తీసుకునే విషయంలో మహిళా ప్రయాణికురాలు కండక్టర్ తో ఘర్షణ పడి,ఆ మహిళా ప్రయాణికురాలు ఆర్టీసీ కండక్టర్ ను బస్సులో నుండి,కిందకు తోసి వేయగా బస్సు కండక్టర్ రోడ్డుపైన పడగానే ఆర్టీసీ బస్ చక్రాలు ఆమె కాళ్ల మీద నుండి వెళ్ళగా తీవ్రమైన గాయాలు పాలైన కండక్టర్,... మిట్టగూడెంలో జరిగిన ప్రమాద ఘటన విషయంలో బస్ డ్రైవర్,పోలీస్ స్టేషన్,లో,ఇచ్చిన ఫిర్యాదు మేరకు,విచారణ జరిపి సిఐ ఎల్లయ్య, నిందితురాలుపై కేసు నమోదు చేయడం జరిగింది. బస్ కండక్టర్ ప్రమాద ఘటనలో కారకురాలు నిందితురాలైన బానోత్ మౌనికను సోమవారం అశ్వాపురం సిఐ ఎల్లయ్య అరెస్టు చేసి ఆమెపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసి మణుగూరు కోర్టు నందు హాజరు పరిచారు.

## పాత పాల్వంచ గడియకట్టలో సిమెంట్ రోడ్ నిర్మాణ పనులను ప్రారంభించిన

**కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 26 ( తొలివార్త ):** పాత పాల్వంచ పట్టణంలోని 46వ డివిజన్ గడియకట్ట ప్రాంతంలో నూతనంగా మంజూరి అయిన సిమెంట్ రోడ్ నిర్మాణ పనులను సోమవారం కార్పొరేటర్ కొత్వాల విమలదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా విమలాదేవి మాట్లాడుతూ డివిజన్ ప్రజలకు నిత్యం అందుబాటులో వుంటూ, వారికి మౌళిక సదుపాయాలు కల్పించేలా కృషి చేస్తున్నానన్నారు.గతంలో చేపట్టిన, అసంపూర్తిగా మిగిలివున్న రోడ్లు, డ్రైన్ లను సంపూర్ణంగా నిర్మాణం చేపడుతున్నామని విమలాదేవి అన్నారు.ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ గంగుల త్రిదేవ్, గడియకట్ట ప్రాంత నాయకులు డాక్టర్ మస్తాన్, బర్ల పాపారావు, బర్ల అన్వేష్, తాళ్లూరి సుధాకర్, సాబేర, అపరిచింతల శివ, కృష్ణ వేణి, పావని తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాల బలోపేతానికి మరో ముందడుగు..

**లక్ష్మీపురంలో వెన్నెల జ్యోతి గ్రామ మహిళా సంఘ భవనాన్ని ప్రారంభించిన**

**పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు**

**భద్రాద్రి జిల్లా బూర్గంపాడు అక్టోబర్ 26 ( తొలివార్త ):** బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామంలో వెన్నెల జ్యోతి గ్రామ మహిళా సంఘ భవనాన్ని పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ శ్రీ పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాల కార్యకలాపాలకు అవసరమైన వసతులు కల్పించడం, మహిళలు ఒకచోట సమావేశమై తమ సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించుకోవడానికి ఈ భవనం ఉపయోగపడనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, మహిళా సంఘాలు గ్రామీణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించడంతో పాటు కుటుంబాల అభ్యున్నతికి, గ్రామాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని ఆకాంక్షించారు. మహిళా సంఘాల ద్వారా పొదుపు అలవాట్లు పెంపొందించుకోవడం, స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం, పరస్పర సహకారంతో ఆర్థికంగా ఎదగడం సాధ్యమవుతుందని తెలిపారు. మహిళలు తమ సమస్యలను చర్చించుకోవడానికి, సంఘ సమావేశాలు నిర్వహించుకోవడానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన







పెంపొందించుకోవడానికి మహిళా సంఘ భవనాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. గ్రామీణ మహిళలకు అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉండటం వల్ల సంఘాల కార్యకలాపాలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ, మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా ప్రోత్సహించడం అవసరమని ఎమ్మెల్యే తెలిపారు. మహిళా సంఘాలు ఐకమత్యంతో ముందుకు సాగుతూ, అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకొని తమ కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవాలని సూచించారు. గ్రామాల అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. లక్ష్మీపురం గ్రామంలో వెన్నెల జ్యోతి గ్రామ మహిళా సంఘ భవనం ప్రారంభం కావడంతో మహిళా సంఘాల సమావేశాలు, సామూహిక కార్యక్రమాల నిర్వహణకు అనుకూలమైన వేదిక అందుబాటులోకి వచ్చింది. ఈ భవనాన్ని మహిళా సంఘ సభ్యులు సమర్థవంతంగా వినియోగించుకుంటూ సంఘ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో కె ఆర్ కె వి ప్రసాద్, ఎంపీడీవో జమలారెడ్డి, మండల అధ్యక్షులు పూలపల్లి సుధాకర్ రెడ్డి, జిల్లా ముఖ్య నాయకులు సొసైటీ మాజీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు పోతిరెడ్డి వెంకటేష్ రెడ్డి, సర్పంచులు లక్ష్మీపురం సర్పంచ్ బాదం వెంకటేశ్వర రెడ్డి, కృష్ణ సాగర్ సర్పంచ్ తాటి వాణి, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్ పిఏసిఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

**రైతులు ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి**

**పిఏసిఎస్ చైర్మన్ ఈడుదుల ముస్తాన్ బాబు యాదవ్**

**చౌటుప్పల్, అక్టోబర్ 26 ( తొలివార్త ):** ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చౌటుప్పల్ ఆధ్వర్యంలో వానాకాలం వరి ధాన్యం కొనుగోలు సీజన్ ప్రారంభమైంది.ఈ మేరకు సోమవారం చౌటుప్పల్ మండలంలో మందోల్లగూడెం, ఎస్.లింగోటం, నేలపట్ల,అంకిరెడ్డి గూడెం,నక్కలపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. చౌటుప్పల్ పిఏసిఎస్ చైర్మన్ ఈడుదుల ముస్తాన్ బాబు యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ ఉబ్బు వెంకటయ్య,జిల్లా సహకార అధికారి నాగార్జున,తహసీల్దార్ బి.వీరాబాయి,ఏడీఏ తదితరులు పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా పిఏసిఎస్ చైర్మన్ ఈడుదుల ముస్తాన్ బాబు యాదవ్ మాట్లాడుతూ...**



రైతులు తమ వరి ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని,మధ్య దళారులకు అమ్మవద్దని కోరారు. పట్టా పాస్ బుక్,ఆధార్ కార్డు,బ్యాంక్ పాస్ బుక్ తదితర పత్రాలతో వస్తే కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పిస్తామని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కల్పిస్తామని,రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కో-ఆపరేటివ్ ఏఆర్ కే.సురేష్,మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు,ఏఎంసి వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, పిఏసిఎస్ వైస్ చైర్మన్ పర్నె శివారెడ్డి,డైరెక్టర్లు బొబ్బిళ్ల రాజేందర్,సుర్కంటి లక్ష్మమ్మ,జక్కిడి వెంకటరెడ్డి,నల్ల నరేందర్ రెడ్డి,రావుల స్వామి,గుర్రం మనోహర్ రెడ్డి,మల్కాపురం సుగుణమ్మ,మేకల దేవేందర్ రెడ్డి,బత్తుల శ్రీహరి మరియు ఆయా గ్రామాల సర్పంచులు తంగేళ్ల వెంకటేశం,గంగాపురం వసంత నాగేష్ గౌడ్,బీమిడి ప్రదీప్ జీ,సుర్వి మల్లేష్ గౌడ్,ఉప సర్పంచులు పిన్నింటి శ్రీనివాస్ రెడ్డి,సుర్కంటి శ్రీధర్ రెడ్డి,బాతరాజు ధనుంజయ,ఏఎంసి డైరెక్టర్లు పబ్బు శ్రీకాంత్ గౌడ్,ఢిల్లీ చంద్రకళ,మాజీ ఎంపీటీసీ బూరుగు కృష్ణారెడ్డి,చెన్నగోని వెంకటేశం,మాజీ పిఏసిఎస్ చైర్మన్లు వెల్ల రాజశేఖర్ రెడ్డి,మాజీ వైస్ చైర్మన్ చెన్నగొని అంజయ్య గౌడ్, ఆయా గ్రామాల వార్డు మెంబర్లు, రైతులు,ముఖ్య నాయకులు,ఏఈఓ శంకర్,జీపీఓ వెంకటరత్నం,సంస్థ కార్యదర్శి వై.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ బాధ్యతలు.. సినీ రంగంపై మక్కువ!

**షార్ట్‌ఫిల్మ్‌తో సత్తా చాటిన యువ దర్శకుడు**

**మొరంపల్లి బంజర్ శనగ రవీంద్రబాబు**

**భద్రాద్రి జిల్లా బూర్గంపాడు అక్టోబర్ 26 ( తొలివార్త ):** ప్రభుత్వ ఉద్యోగం ఒకవైపు.. సినిమాపై అంతులేని అభిరుచి మరోవైపు.. ఈ రెండింటినీ సమన్వయం చేసుకుంటూ తన కలను నిజం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం మొరంపల్లి బంజర్‌కు చెందిన యువ దర్శకుడు రవీంద్రబాబు. ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూనే సినీ రంగంపై తనకున్న మక్కువతో 'యాడ్స్' పేరుతో షార్ట్‌ఫిల్మ్‌ను తెరకెక్కించి తన ప్రతిభను చాటుకున్నారు. ఆయన దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్ర ప్రీమియర్ ప్రదర్శన ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగింది.

**అభిరుచే ఆయుధంగా.. ప్రతిభే పెట్టుబడిగా!**

సినిమా రంగంలో రాణించాలంటే అపారమైన అభిరుచితో పాటు సృజనాత్మకత, పట్టుదల, నిరంతర కృషి అవసరం. ఈ లక్షణాలను తనలో నింపుకుంటూ రవీంద్రబాబు 'యాడ్స్' చిత్రాన్ని రూపొందించారు. వృత్తిరీత్యా ప్రభుత్వ ఉద్యోగిగా బాధ్యతలు



నిర్వహిస్తున్న ఆయన.. తన ఖాళీ సమయాన్ని సినీ సృజనకు కేటాయిస్తూ కథ, కథనం, సంభాషణలు, దర్శకత్వంపై ప్రత్యేక శ్రద్ధ చూపించారు. ఉద్యోగం చేస్తున్నామనే కారణంతో తమలోని ప్రతిభను, కలలను పక్కన పెట్టాల్సిన అవసరం లేదని తన ప్రయత్నం ద్వారా చాటిచెబుతున్నారు.

**ఆసక్తి రేకెత్తిస్తున్న 'యాడ్స్'**

రవీంద్రబాబు దర్శకత్వంలో రూపొందిన 'యాడ్స్' షార్ట్‌ఫిల్మ్ ప్రేక్షకుల్లో ఆసక్తిని కలిగిస్తోంది. కథలోని మలుపులు, ఉత్కంఠభరితమైన కథనం ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉన్నాయని ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన ప్రీమియర్ ప్రదర్శనతో తన దర్శకత్వ ప్రతిభను మరింతమందికి పరిచయం చేసే అవకాశాన్ని ఆయన అందిపుచ్చుకున్నారు.

**యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న ప్రయాణం!**

ప్రతిభ ఉన్నా అవకాశాలు రావడం లేదని నిరాశ చెందే యువతకు రవీంద్రబాబు ప్రయాణం ఒక ప్రేరణగా నిలుస్తోంది. ఉద్యోగం చేస్తూనే తనకిష్టమైన రంగంలో అడుగులు వేస్తూ, ఆసక్తికి కృషిని జోడిస్తే అనుకున్న లక్ష్యాల దిశగా ముందుకు సాగవచ్చని ఆయన నిరూపిస్తున్నారు. మొరంపల్లి బంజర్‌కు చెందిన యువకుడు సినీ దర్శకుడిగా తన ప్రతిభను చాటుకోవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని మంచి చిత్రాలను రూపొందిస్తూ సినీ రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని, తన స్వగ్రామానికి మంచి పేరు తీసుకురావాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూనే సినిమా కలను సాకారం చేసుకునేందుకు సాగుతున్న రవీంద్రబాబు ప్రయాణం.. పట్టుదల ఉంటే అభిరుచికి కూడా రెక్కలు వస్తాయని చాటిచెబుతోంది.

# నెల్లిపాక లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

**ఎమ్మెల్యే ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు**

**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 26 ( తొలివార్త ):** అశ్వాపురం మండలంలోని నెల్లిపాక గ్రామంలో శ్రీరామ కాటన్ ఇండస్ట్రీస్‌లో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారం పత్తి కొనుగోళ్లు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా, నేరుగా సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకువచ్చి, నిబంధనలకు అనుగుణంగా విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు.పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. రైతులు పంటను విక్రయించే సమయంలో అనవసర ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహనఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు సంభవించే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని పాయం వెంకటేశ్వర్లు



గారు సూచించారు. వాతావరణ మార్పులు వ్యవసాయంపై చూపే ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ అధికారులు అందించే సూచనలు, సలహాలను పాటించాలని తెలిపారు. పంటల సంరక్షణ, నీటి వినియోగం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ పనుల నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని రైతులకు వివరించారు.రైతుల పంటకు గిట్టుబాటు ధర లభించేలా కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగడం ముఖ్యమని పేర్కొన్నారు. రైతులు సీసీఐ కేంద్రాలను సద్వినియోగం చేసుకుని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పత్తిని విక్రయించి గిట్టుబాటు ధరతో ప్రయోజనం పొందాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బూర్గంపాడు వ్యవసాయ



మార్కెట్ కమిటీ ఇంచార్జ్ మరియు భద్రాచలం మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ సంబంధిత శాఖ అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఓరుగంటి రమేష్ బాబు, సీనియర్ నాయకులు,గాదె కేశవరెడ్డి, నెల్లిపాక సొసైటీ చైర్మన్ తూక్కని మధుసూదన్ రెడ్డి, వరలక్ష్మి కన్స్ట్రక్షన్ అధినేత వేములపల్లి రమేష్,మాజీ సర్పంచ్ కాకా రాములు కోమటిరెడ్డి వెంకటరెడ్డి,లంకమల్ల,కొండలరావు,సామకూరి వెంకన్న తూము వీర రాఘవులు, ఆవుల రవి, ఏకాంబరం, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, నాయకులు, రైతులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దివ్య కళ్యాణం మరియు శబరి స్మృతి యాత్రలో పాల్గొన్న

**ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సర్పంచ్ పూనెం కృష్ణ పట్టణ నాయకులు**

**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 26 ( తొలివార్త ):** భద్రాచలం పట్టణంలో నిర్వహించిన శబరి స్మృతి యాత్రలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు అనంతరం కళ్యాణ మండపంలో జరిగిన శ్రీ సీతారామచంద్రస్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ దంపతులు కలిసి పాల్గొన్నారు. అలాగే భద్రాచలం మేజర్ గ్రామ పంచాయతీ 12వ వార్డు మెంబర్ కారం దుర్గారావు పాల్గొని స్వామివారి దివ్య కళ్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు శ్రీ సీతారామచంద్రస్వామి వారి దివ్య కళ్యాణాన్ని భక్తిశ్రద్ధలతో వీక్షించి, స్వామివారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.కళ్యాణం అనంతరం శ్రీ సీతారామచంద్రస్వామి వారి మెమొంటో ఇచ్చి ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ని శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి కార్యనిర్వహణాధికారి దామోదర్, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది, పట్టణ ప్రముఖులు, ఆదివాసి సంఘాల నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు మరియు పార్టీ నాయకులు రత్నం రమాకాంత్, భీమవరపు వెంకటరెడ్డి, చింతాడి



చిట్టిబాబు, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ గాడి విజయ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఆకుల వెంకట్, యూత్ కాంగ్రెస్ మండల కార్యదర్శి మాచినేని భాను యూత్ నాయకులు చక్రి, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రానికి తుపాను ముప్పు గంటకు 125 కి.మీ వేగంతో గాలులు ఈ 3 రోజులే కీలకం

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగండం తుపానుగా బలపడిందని వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ రోజు అర్ధరాత్రికి తీవ్ర తుపానుగా రేపు అతి తీవ్ర తుఫానుగా బలపడుతుందని ప్రకటించారు.బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగండం తుపానుగా బలపడిందని అమరావతి వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ తుపాను గడిచిన 6 గంటల్లో 15 కిలోమీటర్ల వేగంతో కదిలి విశాఖకు 650, కాకినాడకు 730, మచిలీపట్నానికి 830, బాపట్లకు 900 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ రోజు అర్ధరాత్రికి తీవ్ర తుపానుగా, రేపు అతి తీవ్ర తుఫానుగా బలపడుతుందని ప్రకటించారు. బుధవారం ఉదయం బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం ఉందని వెల్లడించారు. సోమ, మంగళ, బుధవారాలలో అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ప్రజలకు సూచించింది.ఉవ్వేత్తున ఎగిసిపడుతునన కెరటాలు : తుపాను ప్రభావంతో నెల్లూరు జిల్లా తీరప్రాంతంలో సముద్రం ఉధృతంగా మారుతోంది. విడవలూరు మండలం పెద్దపాలెం వద్ద సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. సముద్రపు నీరు దాదాపు 100 మీటర్ల మేర తీరంలోకి చొచ్చుకువచ్చాయి. మత్స్యకారుల వేట పడవలు, వలలు కొట్టుకుపోయే ప్రమాదం ఏర్పడింది. పరిస్థితిని గమనించిన మత్స్యకారులు ట్రాక్టర్ల సహాయంతో తమ బోట్లు, వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సముద్రం ఉగ్రరూపానికి తీర ప్రాంతవాసులు భయాందోళన చెందుతున్నారు.అధికారిక సమాచారాన్నే



అనుసరించాలి : 'అర్నబ్' తుపాను తీవ్రరూపం దాల్చుతున్నందున రాష్ట్ర యంత్రాంగాన్ని హోంమంత్రి అనిత అప్రమత్తం చేశారు. తుపాను గమనాన్ని అధికారులతో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం వాతావరణం ప్రశాంతంగా ఉందనే భావనతో అలసత్వం వహించవద్దని ప్రజలకు సూచించారు. రేపు, ఎల్లుండి అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు పెట్టుకోవద్దని స్పష్టం చేశారు. తుపాను ప్రభావిత జిల్లాలకు ఇప్పటికే ఎన్డీఆర్?ఎఫ్?, ఎడీఆర్?ఎఫ్? బృందాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. రాబోయే 3 నుంచి 5 రోజుల పాటు తీర ప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మకుండా ఏపీఎస్?డీఎంఏ, ఆర్టీజీఎస్? విడుదల చేసే అధికారిక సమాచారాన్నే అనుసరించాలని మంత్రి అనిత విజ్ఞప్తి చేశారు.తుపాను ప్రభావంతో విద్యుత్ శాఖలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అధికారులను హెచ్చరించారు. విద్యుత్ స్తంభాలు కూలినా, సరఫరాకు అంతరాయం ఏర్పడినా యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తుపానుపై విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి తుపాను తీవ్రతతో విద్యుత్ వ్యవస్థకు భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉన్నందున పూర్తి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తగినంత సిబ్బందిని అందుబాటులో ఉంచుకుని పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఎక్కడా ప్రాణనష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ సరఫరాను ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా నిలిపివేసినా, ఇతర కారణాలతో అంతరాయం ఏర్పడినా ప్రజలకు ముందుగానే సమాచారం అందించాలని గొట్టిపాటి ఆదేశించారు. తుపాను దృష్ట్యా శ్రీకాకుళం జిల్లా యంత్రాంగాన్ని మంత్రి అచ్చెన్నాయుడు అప్రమత్తం చేశారు. ముందస్తు ప్రణాళికతో అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. బోట్లు సురక్షితంగా తీరానికి చేరేలా చర్యలు తీసుకోవాలని అలానే ప్రజలకు ఆహారం, తాగునీరు, వైద్య సేవలకు అంతరాయం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే తక్షణమే పునరుద్ధరించేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు అత్యవసర సమయాల్లో జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నెంబర్ 08942-240557 కి ఫోన్? చేయవచ్చని సూచించారు.

# శ్రీవారి దర్శనానంతరం ప్రమాదం.. తమిళనాడు భక్తులకు గాయాలు

**తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో కారు ప్రమాదం**

**అదుపుతప్పి కొండను ఢీకొట్టడంతో ఘటన**

**బాధితులు తమిళనాడుకు చెందిన వారిగా గుర్తింపు**

**క్షతగాత్రులను చికిత్స కోసం రుయా ఆసుపత్రికి తరలింపు**



తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో ఆదివారం ప్రమాదం సంభవించింది. భక్తులతో వెళ్తున్న ఓ కారు అదుపుతప్పి కొండను ఢీకొట్టిన ఘటనలో ఐదుగురు గాయపడ్డారు. బాధితులను తమిళనాడుకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు.తమిళనాడు నుంచి వచ్చిన భక్తులు శ్రీవారిని దర్శించుకుని కారులో తిరుపతికి తిరుగుప్రయాణమయ్యారు. ఈ క్రమంలో మొదటి ఘాట్ రోడ్డులోని మాల్వాడి గుండం సమీపంలోకి రాగానే, కారు అదుపుతప్పి వేగంగా వెళ్లి రోడ్డు పక్కన ఉన్న కొండను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు భక్తులకు గాయాలయ్యాయి.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, టీటీడీ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని తిరుపతిలోని రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం కారణంగా ఘాట్ రోడ్డులో కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడగా, పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

# 'సాయికృష్ణ మృతదేహాన్ని శ్మశానానికి ఎవరు తెచ్చారు స్వర్గపురిలో సీబీఐ విచారణ

సీబీఐ అధికారులు సాయికృష్ణ మృతి కేసులో దర్యాప్తును వేగవంతం చేశారు. 3వ రోజు విజయవాడ కృష్ణలంక స్వర్గపురిలో సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాయికృష్ణ మృతి కేసు విచారణలో సీబీఐ అధికారులు దూకుడు పెంచారు. 3వ రోజు విజయవాడ కృష్ణలంక స్వర్గపురిలో సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మే 12వ తేదీన అర్ధరాత్రి సాయికృష్ణ మృతదేహాన్ని ఎవరు తీసుకొచ్చారు ఏం చేశారు ఆరోజు విధుల్లో ఎవరు ఉన్నారు అని ఆరా తీశారు. సిబ్బంది స్టేట్‌మెంట్స్ రికార్డు చేసుకున్నారు. ఇప్పటికే కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో సీబీఐ, ఫోరెన్సిక్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.సీబీఐ అధికారులు సాయికృష్ణ మృతి కేసులో దర్యాప్తును వేగవంతం చేశారు. కృష్ణలంకలోని శ్మశానం, గుణదలలోని హోటల్‌లో సీబీఐ, ఫోరెన్సిక్ అధికారులు పరిశీలించారు. సాయికృష్ణ మృతదేహాన్ని శ్మశానంలోని 16వ ప్లాట్‌ఫారంపై దహనం చేసినట్లు సిట్ దర్యాప్తులో గతంలోనే వెలుగుచూసింది. స్వర్గపురికి వెళ్లిన సీబీఐ అధికారులు అక్కడ పరిసరాలను పరిశీలించారు. మృతదేహాలను ఎక్కడ దహనం చేస్తారని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి మొత్తం ఎంత మంది పని చేస్తున్నారని ఆరా తీశారు. మే 12న అర్ధరాత్రి సాయికృష్ణ మృతదేహాన్ని శ్మశానానికి ఎవరు తెచ్చారు ఆ సమయంలో ఎవరు విధుల్లో ఉన్నారు అనే వివరాలు రాబట్టారు.దహనం విషయంలో నిబంధనలు ఏంటి : సూర్యాస్తమ సమయం తర్వాత అంతిమ సంస్కారాలు నిర్వహించారని అక్కడి సిబ్బంది సీబీఐ అధికారులకు చెప్పారు. ఆరోజు ఏం జరిగిందో తమకు తెలియదని అన్నారు. అనాథ శవాల దహనం విషయంలో నిబంధనలు ఏమిటి ఇందుకు ఎవరి అనుమతి అవసరం అస్తికలను భద్రపరుస్తారా అన్న ప్రశ్నలకు సమాధానాలు రాబట్టారు. అనంతరం ప్లాట్‌ఫారాల వద్దకు వెళ్లి పరిశీలించి ఫొటోలు తీసుకున్నారు. దహనం తర్వాత బూడిదను, వ్యర్థాలను ఎక్కడకు తరలిస్తారని అడగ్గా సింగ్‌నగర్ పైపుల రోడ్డులోని డంప్‌యార్డ్‌కు తరలిస్తారని సిబ్బంది వివరించినట్లు తెలిసింది. స్వర్గపురిలో పనిచేసే సిబ్బంది స్టేట్‌మెంట్లను రికార్డు చేసుకున్నారు.స్వర్గపురిలోని కంప్యూటర్ ఆపరేటర్ రవిని పిలిచి విద్యుత్, కట్టెల దహన వాటికల్లో సిబ్బంది ఎంత మంది ఉన్నారు వారి విధులు ఏంటి అని అడిగారు. సీసీ కెమెరాల గురించి సీబీఐ అధికారులు సిబ్బందిని ప్రశ్నించారు. జూన్ నెలలో మొత్తం 8 సీసీ కెమెరాలను అమర్చారని, నగరపాలికలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఫుటేజీ ఉంటుందని అన్నారు. సిబ్బంది ఫోన్ నంబర్లు



తీసుకుని అవసరమైనప్పుడు పిలుస్తామని, రావాల్సి ఉంటుందని చెప్పారు.మే 8వ తేదీన సాయికృష్ణను తీసుకుని హెడ్‌కానిస్టేబుళ్లు నాని, బాబూరావు, సాంబయ్యలు గుణదల వెళ్లారు. ఆరోజు మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు గుణదలలోని హోటల్‌లో ఉన్నారు. సీబీఐ అధికారులు ఆ హోటల్‌కు వెళ్లి పరిశీలించారు. అక్కడి సిబ్బంది నుంచి వివరాలు రాబట్టారు. హోటల్‌కు వచ్చేటప్పటికి సాయికృష్ణ పరిస్థితి ఎలా ఉంది ఎంత సేపు ఉన్నారు ఎవరెవరు వచ్చారు అన్న సమాచారం తెలుసుకున్నారు.

# సన్న బియ్యం సరఫరాలో మోసం.. 14 మంది రైస్ మిల్లర్లను అరెస్ట్ చేసిన సీఐడీ

**ఎఫ్‌సీఐకి బియ్యం సరఫరాలో అక్రమాలు**

**సన్న బియ్యం స్థానంలో దొడ్డు బియ్యం సరఫరా చేసినట్లు ఆరోపణలు**

**నిజామాబాద్, కరీంనగర్, ములుగు జిల్లాల్లో వెలుగుచూసిన మోసం**

**ప్రభుత్వానికి రూ.1.69 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా**



తెలంగాణలో భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కు బియ్యం సరఫరా చేసే ప్రక్రియలో భారీ అక్రమాలకు పాల్పడిన 14 మంది రైస్ మిల్లర్లను రాష్ట్ర నేర పరిశోధన విభాగం (సీఐడీ) అరెస్ట్ చేసింది. 2025--26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నిబంధనల ప్రకారం 'సన్న రకం' బియ్యాన్ని సరఫరా చేయాల్సి ఉండగా, వాటి స్థానంలో నాసిరకం 'దొడ్డు బియ్యాన్ని' అందజేసినట్లు వీరిపై అభియోగాలు నమోదయ్యాయి.పౌరసరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ (ప్రొక్యూర్‌మెంట్) ఈ నెల 24న అందజేసిన ఫిర్యాదు మేరకు సీఐడీ దర్యాప్తు చేపట్టింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తమకు కేటాయించిన సన్న రకం ధాన్యాన్ని మిల్లర్లు బహిరంగ మార్కెట్లో విక్రయించుకుని, అందుకు బదులుగా ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు సేకరించిన దొడ్డు బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించినట్లు అధికారులు గుర్తించారు. సేకరించిన నమూనాలను ప్రయోగశాలలో పరీక్షించగా, అవి నిర్దేశిత సన్న రకం బియ్యం కాదని నిర్ధారణ అయ్యింది.నిజామాబాద్, కరీంనగర్, ములుగు జిల్లాల్లోని 16 రైస్ మిల్లులు సన్న బియ్యానికి బదులుగా సుమారు 3,385 టన్నుల దొడ్డు బియ్యాన్ని సరఫరా చేసినట్లు విచారణలో వెల్లడైంది. దీనివల్ల ప్రభుత్వానికి బోనస్ రూపంలో సుమారు రూ.1.69 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి బియ్యం సేకరణను నిలిపివేయడంతో సుమారు రూ.242 కోట్ల మేర జరగాల్సిన భారీ ఆర్థిక నష్టాన్ని నివారించగలిగారు.ఈ ఉదంతంపై మూడు క్రిమినల్ కేసులు నమోదు చేసిన సీఐడీ అధికారులు దర్యాప్తును వేగవంతం చేశారు. బియ్యం మళ్లింపు, కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఒప్పంద నిబంధనల ఉల్లంఘన, క్రిమినల్ కుట్ర వంటి సెక్షన్ల కింద విచారణ జరుపుతున్నారు. ఈ కుంభకోణంలో ఎవరైనా ప్రభుత్వ అధికారుల ప్రమేయం ఉందా అనే కోణంలోనూ ఆరా తీస్తున్నారు.

# ఐటీ కారిడార్‌లో అందమైన రోడ్లు అంతర్జాతీయ స్థాయిలో ఫుట్‌పాత్‌ల నిర్మాణం

ఐటీ కారిడార్‌లో రహదారి విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. వీటితో పాటు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టేందుకు సీఎంసీ నిర్ణయించింది. ఇందుకోసం రద్దీగా ఉండే రోడ్లను ఎంపిక చేసి ప్రణాళికలు రూపొందిస్తున్నారు.ఐటీ కారిడార్‌తో కొత్తగా ఏర్పడిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ తరహాలోనే ప్రధాన రహదారుల వెంబడి ఫుట్‌పాత్‌లను అభివృద్ధి చేయడంపై దృష్టి సారిస్తోంది. రోడ్లను విస్తరించే పనులను పూర్తి చేయడంతో పాటు, ఈ రహదారులకు ఇరువైపులా ప్రపంచస్థాయి ప్రమాణాలతో కాలిబాటలను నిర్మించాలని సీఎంసీ కమిషనర్ డాక్టర్ సృజన నిర్ణయించారు. ఈ మేరకు ఇప్పటికే పలు రోడ్డు మార్గాలను ఎంపిక చేశారు.

**ఏడీబీ రుణ సదుపాయాన్ని వినియోగించుకునేలా**

ప్రస్తుతం సీఎంసీ పరిధిలో హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్ సిటీ) కింద రూ.2 వేల కోట్ల



విలువైన పనులు కొనసాగుతున్నాయి. ఇతర ప్రాజెక్టులను అమలు చేయడానికి బ్యాంకు రుణాల ద్వారా నిధులు సమీకరించాలని సీఎంసీ భావించింది. అదే సమయంలో రుణాల ప్రతిపాదనలు సమర్పించాలని ఏడీబీ బ్యాంకు ప్రతినిధులు కోరారు. దీంతో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు కమిషనర్ సమగ్ర ప్రణాళిక రూపొందించారు.ఈ మేరకు ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే రోడ్లను ఎంపిక చేశారు. ప్రస్తుతం ఆయా రోడ్ల అభివృద్ధికి సంబంధించి ఇంజినీరింగ్ విభాగం డిజైన్లు రూపొందిస్తోంది. సీఎంసీ పరిధి అభివృద్ధి పనుల జాబితాలో ప్రస్తుతం మెట్రో కారిడార్‌తో పాటు విస్తరణ పనులు జరుగుతున్న రహదారులు కూడా ఉన్నాయి. జంక్షన్ల దగ్గర పాదచారులు సురక్షితంగా, సులభంగా రోడ్డు దాటేందుకు వీలుగా లేన్ మార్కింగ్‌లు, జీబ్రా క్రాసింగ్‌లు, ఫుట్‌పాత్ ర్యాంపులు ఏర్పాటు చేసి, అందుబాటులోకి తీసుకొస్తామని సీఎంసీ అధికారులు చెబుతున్నారు.

**పార్కులు, వరద నీటి కాలువల ఏర్పాటుకు సన్నాహాలు**

సైబరాబాద్ పురపాలక సంస్థ పరిధిలో కేవలం ప్రహరీ గోడలు మాత్రమే ఉన్న 350 ఖాళీ ప్లాట్లను పార్కులుగా అభివృద్ధి చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా వాటి డిజైన్లను ఖరారు చేసి, త్వరలో ఏడీబీకి సమర్పించేందుకు కసరత్తు చేస్తున్నారు. దీంతో పాటు జాతీయ రహదారులకు ఇరువైపులా వరద నీటి వ్యవస్థను అభివృద్ధి చేయడం, ప్రస్తుతం ఉన్న నాలాల పునరుద్ధరించే పనులకు సంబంధించి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

# టీజీఎస్ఆర్టీసీ గుడ్ న్యూస్.. రూ.600కే హైదరాబాద్‌లో వారమంతా బస్సు ప్రయాణం!

**హైదరాబాద్ ప్రయాణికుల కోసం టీజీఎస్ఆర్టీసీ కొత్త వీక్లీ పాస్**

**రూ.600 చెల్లిస్తే వారం రోజుల పాటు అన్‌లిమిటెడ్ ప్రయాణం**

**ఏసీ బస్సులతో సహా అన్ని సిటీ బస్సుల్లోనూ ఈ పాస్ చెల్లుబాటు**

**ఎయిర్‌పోర్ట్ పుష్పక్ సర్వీసులకు మాత్రం మినహాయింపు**

**అన్ని సిటీ బస్ పాస్ కౌంటర్లలో ఈ పాస్ అందుబాటులో!**



హైదరాబాద్ నగరంలో బస్సుల్లో ప్రయాణించే వారికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఒక శుభవార్త అందించింది. ప్రయాణికుల సౌకర్యార్థం కొత్తగా అన్‌లిమిటెడ్ బస్ పాస్‌ను ప్రవేశపెట్టింది. కేవలం రూ.600 చెల్లించి ఈ పాస్‌ను పొందడం ద్వారా ఏడు రోజుల పాటు నగరంలో అపరిమితంగా ప్రయాణించవచ్చు.ఈ కొత్త పాస్ కొనుగోలు చేసిన తేదీ నుంచి వరుసగా ఏడు రోజుల పాటు చెల్లుబాటులో ఉంటుంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో తిరిగే ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, మెట్రో డీలక్స్ బస్సులతో పాటు ఏసీ బస్సుల్లోనూ ఈ పాస్‌తో ప్రయాణించేందుకు అనుమతి ఉంటుందని టీజీఎస్ఆర్టీసీ స్పష్టం చేసింది. అయితే, శంషాబాద్ విమానాశ్రయానికి నడిచే పుష్పక్ ఎయిర్‌పోర్ట్ లైనర్ సర్వీసులకు మాత్రం ఈ పాస్ వర్తించదని అధికారులు తెలిపారు.ప్రయాణికులపై ఆర్థిక భారం తగ్గించడంతో పాటు, బస్సు ప్రయాణాన్ని మరింత సులభతరం చేయాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్టీసీ అధికారులు వివరించారు. ఈ కొత్త పాస్‌లు నగరంలోని అన్ని సిటీ బస్ పాస్ కౌంటర్లలో అందుబాటులో ఉంటాయని వారు పేర్కొన్నారు. తరచూ బస్సుల్లో ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులకు ఈ పాస్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నారు.

# ముందు సిద్ధూకు డబ్బులివ్వు అప్పుడే నీ చెక్ ఇస్తా

హైదరాబాద్ కలెక్టర్ ఆఫీస్‌లో 'వసూల్ రాణి'

శామీర్‌పేట ఎలివేటెడ్ కారిడార్ నిర్వాసితులకు ప్రభుత్వం రూ.400 కోట్లు విడుదల చేసింది. దీనిని అవకాశంగా మలచుకొని ఓ అధికారిణి డబ్బులిస్తేనే చెక్ ఇస్తానంటూ వసూళ్ల దందా నడుపుతున్నారు."మీ పేరులో తప్పు ఉంది, మీరు ఏడాదిగా ఇంట్లో లేరు. అయినా సరే మీకు రూ.లక్షల్లో డబ్బులిప్పించాను. పేర్లు తప్పులున్నాయని రాస్తే మీకు ఆ డబ్బు రాదు. అందుకే మా సిద్ధూ చెప్పినట్లుగా మీరు ముందు డబ్బు చెల్లిస్తేనే నేను చెక్కు ఇస్తా. నా స్నేహితులు మేడం, ఎలా అయినా డబ్బులిప్పించండి అని సిద్ధూ రికమండ్ చేశాడు. అందుకే చెక్కు రాశా. మంగళవారంలోగా మీరు డబ్బులివ్వకుంటే మీ ఇష్టం." కొన్ని రోజుల క్రితం ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట వరకు ఉన్న ఎలివేటెడ్ కారిడార్ మార్గంలో భూమిని ఇచ్చిన ఓ వ్యక్తితో హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయ భూ సేకరణ అధికారి పలికిన మాటలివి. ఈ మాటలు ఒక్క వ్యక్తితో పలికినవి కావు, ఆ అధికారి ఫోన్‌లో ఇదే రీతిలో చాలా మందితో మాట్లాడారు.ఎలివేటెడ్ కారిడార్ నిర్వాసితులకు ప్రభుత్వం రూ.400 కోట్లను విడతల వారీగా విడుదల చేసింది. దీనికి సంబంధించి పరిహారం విడుదలైనప్పటి నుంచి సదరు అధికారి బాధితుల నుంచి డబ్బు వసూలు చేయడం మొదలుపెట్టారు. డబ్బు వసూలు చేయడానికి సిద్ధూ అనే ఒక ప్రైవేట్ వ్యక్తిని నియమించారు. సిద్ధూకు డబ్బులందితే వెంటనే కలెక్టర్ కార్యాలయం నుంచి చెక్కు జారీ అవుతుంది.

**ఒక్కొక్కరి నుంచి రూ.20 లక్షల వరకు**

పరిహారం మంజూరైన భూ నిర్వాసితుల నుంచి సదరు అధికారిణి రూ.6 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు వసూలు చేశారు. మరికొందరితోనూ బేరం కుదుర్చుకున్నారు. నెల రోజుల క్రితం తిరుమలగిరి మండలానికి చెందిన ఒక వ్యక్తి నుంచి రూ.6 లక్షలు తీసుకున్నారు. బోయిన్‌పల్లికి చెందిన మరో వ్యక్తి నుంచి సిద్ధూ అనే వ్యక్తి రూ.14 లక్షలు తీసుకున్నాడు. ఇంత చెల్లించినా వారికి చెక్కులు అందకపోవడంతో వారు అక్టోబర్ రెండో వారంలో కలెక్టరేట్‌కు వచ్చి అధికారితో మాట్లాడారు. అయితే అదే సమయంలో పైఅధికారులు వరుసగా సెలవుల్లో ఉన్నారని, మరికొందరు ఇతర పనుల్లో ఉన్నారని వారికి సర్దిచెప్పి, ఈ నెల 19న చెక్కులు ఇస్తామని చెప్పారు. దీంతో వారు సోమవారం ఆఫీసుకు వెళ్లారు. అయితే 'నేనేమైనా మీకు అప్పు ఉన్నానా' అంటూ ఆ అధికారిణి వారిని వెళ్లగొట్టారు. దీంతో ఆగ్రహానికి లోనైన బాధితులు శనివారం కలెక్టర్ కార్యాలయానికి వచ్చి ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. భూసేకరణ అధికారి వసూళ్ల వ్యవహారంపై రెవెన్యూ అధికారుల వద్ద ఆరా తీయగా, ప్రాథమిక ఆధారాలు సేకరిస్తున్నామని ఒక ఉన్నతాధికారి ధ్రువీకరించారు.

**డబ్బు అందిన తర్వాతే చెక్కు**

సికింద్రాబాద్ ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట్ వరకు



నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో ప్రైవేట్ ఆస్తులు, భూములను సేకరించారు. నిర్వాసితులకు పరిహారంగా టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) బాండ్లను ఇస్తామని అధికారులు ప్రతిపాదించగా, యజమానులు నిరాకరించారు. దానికి బదులుగా నగదు ఇవ్వాలని కోరడంతో అధికారులు అంగీకరించారు.ప్రాంతాల వారీగా చదరపు గజానికి రూ.90 వేల నుంచి రూ.1.13 లక్షల వరకు పరిహారం ఇవ్వాలని నిర్ణయించారు. కలెక్టరేట్‌లో చెక్కులు అందజేస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే అక్కడే భూ సేకరణ అధికారి వసూళ్ల పర్వాన్ని ప్రారంభించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి చెక్కు రాసే సమయంలో నిర్వాసితుల నుంచి డబ్బు అందిన తర్వాతే ఆ చెక్కును పంపిణీ చేస్తున్నారు.

# పాతబస్తీకి మెట్రో రైలు ఆ 212 భారీ వృక్షాల తొలగింపు

పాతబస్తీలో మెట్రో నిర్మాణానికి 39 భారీ చెట్లను తొలగించనున్నారు. అటవీ శాఖ అనుమతి వచ్చిన తర్వాత వీటిని తొలగించేందుకు మెట్రో అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.మెట్రో రైలు రెండో దశలో భాగంగా ప్రతిపాదించిన పాతబస్తీలో చేపట్టనున్న మెట్రో మార్గం కోసం అడ్డుగా ఉన్న భారీ వృక్షాలను సంబంధిత సిబ్బంది తొలగిస్తున్నారు. దారుల్‌షిఫా నుంచి చాంద్రాయణగుట్ట వరకు రహదారి విస్తరణ పనుల్లో భాగంగా 39 భారీ చెట్లను తొలగిస్తారు. ఈ మేరకు తొలగించాల్సిన భారీ వృక్షాల జాబితాను మెట్రో అధికారులు సిద్ధం చేశారు. అటవీ శాఖ అనుమతి అనంతరం పనులు చేపట్టనున్నారు. వీటి స్థానంలో ఒకటికి 3 చెట్లు నాటుతామని తెలిపారు. పాతబస్తీ మెట్రో 7.5 కిలోమీటర్ల మార్గంలో తొలగించాల్సిన చెట్లు 123 ఉన్నట్లు ప్రాథమికంగా అధికారులు గుర్తించారు.మెట్రో నిర్మాణంలో భాగంగా అడ్డుగా భారీ వృక్షాలైన రెయిన్ ట్రీ, వేప, అల్స్టోనియా, గుల్మోహర్, బాదం వంటి రకాలున్నాయి. వీటి చుట్టు కొలత గరిష్ఠంగా 295 సెంటి మీటర్లు. పెల్టోఫోరమ్, దిరిషనం, జువ్వి వంటి ఇతర జాతుల చెట్లు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. వీటిలో 84 చెట్లను వేరే చోటకు తరలించి ట్రాన్స్‌లొకేట్ చేయాలని ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ సూచించింది. ఈ



మేరకు ఇప్పటికే శంషాబాద్ సమీపంలో సాతంరాయి వద్ద ఉన్న హెచ్ఎండీఏ భూముల్లో 65 చెట్లను ట్రాన్స్‌లొకేట్ చేసినట్లు మెట్రో అధికారులు వెల్లడించారు. ఆస్తుల సేకరణ అనంతరం మరో 89 చెట్లను తొలగించాలని అధికారులు గుర్తించిన నేపథ్యంలో వీటికి అటవీ శాఖ అనుమతి రావాల్సిన అవసరం ఉంది. మొత్తంగా మెట్రో మార్గం కోసం 212 చెట్లు తొలగించబోతున్నట్లు తెలుస్తోంది.

**జనరల్ కన్సల్టెన్సీకి రెండు బిడ్లు దాఖలు**

ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట, ఎల్బీనగర్-హయత్‌నగర్, నాగోల్ నుంచి శంషాబాద్ విమానాశ్రయం, రాయదుర్గం-కోకాపేట వరకు 4 కారిడార్లకు సంబంధించి ప్యాకేజీ-1 జనరల్ కన్సల్టెన్సీ కోసం నోటిఫికేషన్ ఇవ్వగా, కేవలం రెండు బిడ్లు మాత్రమే దాఖలయ్యాయి. ఇప్పటికే అధికారులు పలుమార్లు గడువు పొడిగించారు. ఆర్వీ అసోసియేట్స్, అయేసా సంస్థలు కన్సార్షియం ఏర్పడి ఒక బిడ్ వేయగా, ట్రైప్సా, నిప్పన్, హిల్ ఒక కన్సార్షియంగా ఏర్పడి మరో బిడ్ దాఖలు వేశాయి. వీటిని మదింపు చేసి జీసీ ఎంపిక ప్రక్రియను వారంలో పూర్తి చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు..

**గణాంకాలు ఇలా ఉన్నాయి**

మెట్రో మార్గంలో తొలగించాల్సిన భారీ చెట్లు : 212 తొలగించడానికి అనుమతి లభించిన చెట్లు : 123 ట్రాన్స్‌లొకేట్ అంటే వేరేచోట నాటేవి : 84 పూర్తిగా తొలగించే చెట్లు : 39 ఆస్తుల సేకరణ అనంతరం అటవీ శాఖ పర్మిషన్‌తో తొలగించేవి : 89

# తిరుమల అప్‌డేట్: సర్వదర్శనానికి 15 గంటల సమయం

**తిరుమలలో సాధారణంగా కొనసాగుతున్న భక్తుల రద్దీ**

**వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 31 కంపార్ట్‌మెంట్లలో నిండిన భక్తులు**

**ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న 85,369 మంది**

**నిన్న హుండీ ద్వారా రూ. 4.13 కోట్ల ఆదాయం**



కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువై ఉన్న తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా కొనసాగుతోంది. సోమవారం ఉదయం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 31 కంపార్ట్‌మెంట్‌లలో భక్తులు శ్రీవారి దర్శనం కోసం వేచి ఉన్నారు.టైమ్ స్లాట్ టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు స్వామివారి దర్శనానికి సుమారు 15 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. క్యూలైన్లలో, కంపార్ట్‌మెంట్‌లలో వేచి ఉన్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ సిబ్బంది పాలు, తాగునీరు మరియు అన్నప్రసాదాలను నిరంతరం అందిస్తున్నారు.నిన్న (ఆదివారం) శ్రీవారిని మొత్తం 85,369 మంది భక్తులు దర్శించుకున్నారు. వీరిలో 26,414 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం ఒక్కరోజే భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4.13 కోట్లుగా నమోదైనట్లు టీటీడీ అధికారులు తెలిపారు.

# ఈ రోజే జియో షేర్ల అలాట్మెంట్.. మీకు వచ్చాయో లేదో ఇలా చెక్ చేసుకోండి..!




ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ కేటాయింపులను అక్టోబర్ 26 సోమవారం ఖరారు చేయనున్నారు. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ కోసం దరఖాస్తు చేసుకున్న పెట్టుబడిదారులు, అధికారిక రిజిస్ట్రార్ అయిన కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్, ఎక్స్ఛేంజీలైన బీఎస్ఈ, ఎన్ఎస్ఈల ద్వారా తమ కేటాయింపు స్థితిని తనిఖీ చేసుకోవచ్చు. తమకు షేర్లు కేటాయించబడ్డాయో లేదో ధృవీకరించుకోవడంతో పాటు కేటాయించిన షేర్ల సంఖ్యను కూడా వారు చూసుకోవచ్చు. కేటాయింపు పొందని దరఖాస్తుదారులకు అక్టోబర్ 27 మంగళవారం నాడు రీఫండ్‌లు చేయనున్నారు. విజయవంతమైన దరఖాస్తుదారులకు కేటాయించిన షేర్లు అదే రోజు వారి డీమ్యాట్ ఖాతాల్లో జమ చేసారు. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ అక్టోబర్ 28 బుధవారం నాడు స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ కానుంది. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ 22.19 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. పబ్లిక్ ఇష్యూ, యాంకర్ ఇన్వెస్టర్ ప్లేస్‌మెంట్ ద్వారా వచ్చిన మొత్తం బిడ్‌లు రూ.7.4 లక్షల కోట్లను అధిగమించాయి. డిజిటల్ సేవల కంపెనీ పబ్లిక్ ఆఫరింగ్‌కు దాదాపు 1.39 కోట్ల దరఖాస్తులు అందాయి. స్టాక్ ఎక్స్ఛేంజ్ డేటా ప్రకారం యాంకర్ ఇన్వెస్టర్ వాటాను మినహాయించి ఈ పబ్లిక్ ఇష్యూ రూ.4.9 లక్షల కోట్లకు పైగా విలువైన బిడ్లను ఆకర్షించగా, రిటైల్ ఇన్వెస్టర్ల బిడ్లు రూ.25,867 కోట్లను దాటాయి. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ గ్రే మార్కెట్ ప్రీమియం (జీఎంపీ) ప్రస్తుతం రూ.247గా కొనసాగుతోంది. ఇది ఒక్కో షేరుకు రూ.1,119 ఐపీఓ ధరల శ్రేణి ఎగువ పరిమితి ఆధారంగా లెక్కించారు. ఇన్వెస్టర్ల కొంపలు ముంచుతున్న ఏఐ.. నష్టాలతో ప్రారంభమైన ఆసియా స్టాక్ మార్కెట్.. నిపుణుల ప్రకారం తాజా ట్రేడింగ్ సెషన్‌లో ఐపీఓ జీఎంపీ పెరిగింది. ఇది లిస్టింగ్‌కు ముందు సానుకూల గ్రే-మార్కెట్ సెంటిమెంట్‌ను సూచిస్తుంది. గత 22 ట్రేడింగ్ సెషన్లలో ప్రీమియం రూ.148 నుంచి 273 మధ్య హెచ్చుతగ్గులకు లోనైంది. ఇది నిరంతర ఆసక్తిని, అలాగే పెట్టుబడిదారుల లిస్టింగ్ అంచనాలలో వైవిధ్యాలను సూచిస్తుంది. అయితే, జీఎంపీ ఒక అనధికారిక సూచిక మాత్రమే. ఇది స్టాక్ యొక్క వాస్తవ లిస్టింగ్ ధరకు హామీ ఇవ్వదని గుర్తుంచుకోవాలి. ఐపీఓ కేటాయింపు తెలుసుకోవడానికి కింది సూచనలు పాటించండి. కెఫిన్ టెక్నాలజీస్ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలి ఐపీఓ కేటాయింపు స్థితి పేజీని ఓపెన్ అవుతుంది. అక్కడ మీ స్థితిని తనిఖీ చేయడానికి ఐదు వేర్వేరు లింక్‌లు ఉంటాయి. ఐదు లింక్‌లలో ఏదైనా ఒకదాన్ని తెరిచిన తర్వాత, 'సెలెక్ట్ ఐపీఓ' డ్రాప్‌డౌన్ మెనూ నుంచి జియో ప్లాట్‌ఫారమ్స్ ఐపీఓను ఎంచుకోవాలి. డీమ్యాట్ ఖాతా నంబర్ లేదా అప్లికేషన్ నంబర్ ఎంపిక చేసుకోవాలి. మీరు అప్లికేషన్ నంబర్ ఎంపికను ఎంచుకుంటే, మీ అప్లికేషన్ నంబర్, క్యాప్చా కోడ్‌ను నమోదు చేసి సబ్మిట్ పై క్లిక్ చేయాలి. మీరు డీమ్యాట్ ఖాతా ఎంపికను ఎంచుకుంటే, మీ డీమ్యాట్ ఖాతా వివరాలు, క్యాప్చా కోడ్‌ను నమోదు చేసి సబ్మిట్ పై క్లిక్ చేయాలి. ఐపీఓ కేటాయింపు వివరాలను బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో కూడా తనిఖీ చేయవచ్చు. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# వచ్చే వారం ఓపెన్ కానున్న ఐపీఓలు ఇవే..!




ఇండియా ఆల్టర్నేటివ్స్, ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీస్, వీఖ సన్స్ ఫైన్ జ్యువెల్స్‌తో సహా ఐదు కంపెనీలు వచ్చే వారం తమ ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్‌లను ప్రారంభించడానికి సిద్ధమవుతున్నాయి. వీటి ద్వారా ప్రైమరీ మార్కెట్ నుంచి దాదాపు రూ. 2,600 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. పాలిమర్స్, బాంబే కోటెడ్ అండ్ స్పెషల్ స్టీల్స్ కూడా ఈ వారంలో తమ తొలి పబ్లిక్ ఆఫరింగ్‌లను ఓపెన్ చేయనున్నాయి. గుజరాత్‌లో దీపావళి అనంతరం నవంబర్ 6 నుండి 15 వరకు జరిగే లాభ పంచమం కారణంగా మార్కెట్లు, వ్యాపార కార్యకలాపాలు ప్రభావితమయ్యే అవకాశం ఉన్నందున, ఆ సుదీర్ఘ దీపావళి సెలవులకు ముందే ఈ కంపెనీలు నవంబర్ 5వ తేదీలోగా ఐపీఓలు తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నాయి. ఈ నెలలోనే జియో ప్లాట్‌ఫామ్స్ రూ. 30,213 కోట్ల విలువైన, దేశంలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో రాబోయే ఇష్యూలు రానున్నాయి. 2026లో ఇప్పటివరకు 104 కంపెనీలు ఐపీఓల ద్వారా రూ. 1.4 లక్షల కోట్లకు పైగా నిధులను సమీకరించాయి. రాబోయే ఐదు ఐపీఓలు అక్టోబర్ 26 నుంచ అక్టోబర్ 29 మధ్య సబ్‌స్క్రిప్షన్ కోసం తెరవనున్నారు. ఇవి పెట్టుబడిదారులకు ప్రత్యామ్నాయ పెట్టుబడులు, పాలిమర్లు, స్టీల్ ప్రాసెసింగ్, మురుగునీటి శుద్ధి, ఆభరణాల రిటైల్ వంటి రంగాలలో అవకాశాలను అందిస్తాయి. వ్యాపార విస్తరణ, నిర్వహణ మూలధన అవసరాలు,రుణ చెల్లింపుల కోసం నిధులను సమీకరించడానికి కంపెనీలు పెట్టుబడిదారుల డిమాండ్‌ను వినియోగించుకుంటున్నాయి. జియో ఐపీఓ వచ్చిన వారికి గుడ్ న్యూస్.. గ్రే మార్కెట్‌లో ప్రీమియంలో ట్రేడవుతున్న షేర్లు..! ఎడెల్వీస్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అనుబంధ సంస్థ అయిన ఈఏఏఏ ఇండియా ఆల్టర్నేటివ్స్ తన రూ. 1,200 కోట్ల ఐపీఓను అక్టోబర్ 26న ప్రారంభించి, అక్టోబర్ 28న ముగించనుంది. ఈ కంపెనీ ఒక్కో షేరుకు రూ. 1,585-1,665 ధరల శ్రేణిని నిర్ణయించింది. దీని ప్రకారం గరిష్ఠ ధర వద్ద షేరు విలువ రూ. 10,765 కోట్లుగా ఉంటుంది. ఈ ఇష్యూ పూర్తిగా ఎడెల్వీస్ గ్రూప్ వారి ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఉంది. అంటే ఈ ఆఫరింగ్ ద్వారా కంపెనీకి ఎలాంటి రాబడి లభించదు. పబ్లిక్ ఇష్యూకు ముందే ఇండియా ఆల్టర్నేటివ్స్ యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి సుమారు రూ. 360 కోట్లు సమీకరించింది. మురుగునీటి శుద్ధి పరిష్కారాలను అందించే సంస్థ అయిన ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీస్ తన రూ. 668 కోట్ల ను ప్రారంభించనుంది. దీని సబ్‌స్క్రిప్షన్ అక్టోబర్ 29న ముగుస్తుంది. కంపెనీ ఒక్కో షేరుకు రూ. 313-330 ధరల శ్రేణిని నిర్ణయించింది. దీని ప్రకారం గరిష్ఠ ధర వద్ద షేరు విలువ దాదాపు రూ. 3,233 కోట్లుగా ఉంటుంది. ఈ ఇష్యూలో రూ. 150 కోట్ల విలువైన ఈక్విటీ షేర్ల ఫ్రెష్ ఇష్యూ, ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారుల ద్వారా 1.57 కోట్ల షేర్ల వరకు ఆఫర్ ఫర్ సేల్ ఉన్నాయి. ఫ్రెష్ ఇష్యూ ద్వారా వచ్చే రాబడిని రుణ చెల్లింపు, వర్కింగ్ క్యాపిటల్ అవసరాల కోసం వినియోగిస్తారు. ఎంకే సన్స్ ఫైన్ జ్యువెల్స్ లిమిటెడ్ తన రూ. 275.4 కోట్ల ఐపీఓను అక్టోబర్ 28న ప్రారంభించి, అక్టోబర్ 30న ముగించనుంది. కంపెనీ ఒక్కో షేరుకు రూ. 153-162 ధరల శ్రేణిని నిర్ణయించింది. ఈ ఐపీఓలో 1.36 కోట్ల ఈక్విటీ షేర్ల ఫ్రెష్ ఇష్యూ, ప్రమోటర్, విక్రయ వాటాదారు అయిన రామ్‌చంద్ మురళీధర్ రైమలానీ ద్వారా 34 లక్షల షేర్ల ఆఫర్ ఫర్ సేల్ ఉన్నాయి. ఈ ఆభరణాల రిటైలర్, మహారాష్ట్రలో కొత్త షోరూమ్ ఏర్పాటు చేయడానికి, గుజరాత్‌లోని ప్రస్తుత షోరూమ్‌ను విస్తరించడానికి అవసరమైన సరుకుల కొనుగోలుకు నిధులు సమకూర్చడంతో పాటు, కొన్ని రుణాలను తిరిగి చెల్లించడానికి ఈ ఐపీఓ ద్వారా వచ్చే నికర ఆదాయాన్ని ఉపయోగించాలని యోచిస్తోంది. బీఎల్ఎస్ పాలిమర్స్ లిమిటెడ్ తన రూ. 255 కోట్ల ఐపీఓను అక్టోబర్ 27న ప్రారంభించనుంది. ఈ ఇష్యూ అక్టోబర్ 29న ముగుస్తుంది. కంపెనీ ఒక్కో షేరుకు రూ. 142-150 ధరల శ్రేణిని నిర్ణయించింది. ఈ ఇష్యూలో 1.7 కోట్ల ఈక్విటీ షేర్ల ఫ్రెష్ ఆఫరింగ్ ఉంది. =వఠీఏఏవఅవవస టశీతీ ఎశీబ్రాజ జీవషవశ్రీశ్రీవతీ: మల్టీబ్యాగర్ రిటర్న్‌ అందిస్తోన్న పీసీ జ్యువెల్లర్. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# ఎలాంటి మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెడితే బెటర్




పెట్టుబడిదారులు సాధారణంగా జనాదరణ పొందిన మ్యూచువల్ ఫండ్ పేర్లను చూసి వాటిలో పెట్టుబడి పెడతారు. అయితే అధిక వీ (ఆస్తుల నిర్వహణ) ఉన్న స్మాల్-క్యాప్ ఫండ్‌లు తప్పనిసరిగా మెరుగైన రాబడులను అందించవని గుర్తుంచుకోవాలని నిపుణులు చెబుతున్నారు. (ఆస్తుల నిర్వహణ) అంటే ఒక మ్యూచువల్ ఫండ్ పథకం తన పెట్టుబడిదారుల తరపున నిర్వహించే ఆస్తులు, నగదు మొత్తం మార్కెట్ విలువ. అతిపెద్ద పథకమైన నిప్పన్ ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్ రూ.80,906 కోట్ల వీతో 23 అక్టోబర్ 2026 నాటికి 1-సంవత్సరంలో -1.40% రాబడిని అందించింది. రెండో అతిపెద్ద పథకమైన ఎస్‌బిఐ స్మాల్ క్యాప్ ఫండ్ రూ.41,059 కోట్ల వీతో -2.33% ప్రతికూల రాబడిని నమోదు చేసింది. నికి విరుద్ధంగా రూ.841 కోట్ల ూఖవీ కలిగిన ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్ స్మాల్ క్యాప్ ఫండ్, ఒక సంవత్సరంలో 5.64% రాబడిని అందించగా రూ.3,671 కోట్ల వీ కలిగిన బ్యాంక్ ఆఫ్ ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్, ఈ విభాగంలోనే అత్యధికంగా 16.71% రాబడిని ఇచ్చింది. చిన్న పథకాలు తమ పెద్ద పథకాల కంటే ఎందుకు మెరుగైన పనితీరును కనబరుస్తాయని నిపుణులు చెబుతున్నారు. స్మాల్-క్యాప్ స్టాక్‌లు తరచుగా తక్కువ పరిమాణంలో ట్రేడ్ అవుతాయని గుర్తు చేశారు. నిప్పన్ ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్, ఎల్ఐసి ఎంఎఫ్ స్మాల్ క్యాప్ ఫండ్ ఫండ్ మేనేజర్లు ఒకే ఆశాజనకమైన కంపెనీని గుర్తించారని అనుకుంటే. ఐదేళ్లలో అత్యధిక రాబడులు ఇచ్చిన స్మాల్ క్యాప్ మ్యూచువల్ ఫండ్లు ఇవే..! ఇద్దరూ తమ తమ పోర్ట్‌ఫోలియోలలో 2 శాతం ఆ స్టాక్‌లో పెట్టుబడి పెట్టాలనుకుంటున్నారు. సుమారుగా రూ.841 కోట్లు నిర్వహించే ఎల్ఐసికి 2 శాతం కేటాయింపు అంటే సుమారు రూ.16.82 కోట్లు పెట్టుబడి పెట్టడం. దాదాపు రూ.80,906 కోట్ల నిధులను నిర్వహిస్తున్న నిప్పన్‌కు, ఇదే కేటాయింపు కోసం దాదాపు రూ.1,618 కోట్లు అవసరమవుతాయి. ఇప్పుడు, ఆ కంపెనీకి సగటున ఒక రోజులో రూ.20 కోట్ల విలువైన షేర్లు ట్రేడ్ అవుతున్నాయని ఊహించుకుంటే. ఎల్ఐసీ సిద్ధాంతపరంగా సుమారు 9 ట్రేడింగ్ సెషన్లలో తన కొనుగోలును పూర్తి చేయగలదు. అవే అంచనాల ప్రకారం నిప్పన్‌కు 800 కంటే ఎక్కువ ట్రేడింగ్ సెషన్లు అవసరమవుతాయి. ఎల్ఐసీ స్మాల్ క్యాప్ ఫండ్ 15.65% రాబడిని అందించగా, నిప్పన్ ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్ ఐదేళ్లలో 17.04% వార్షిక రాబడిని అందించింది. ఏడేళ్లలో నిప్పన్ వార్షికంగా 25.24% రాబడిని ఇవ్వగా, 21.45% రాబడిని ఇచ్చింది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# ఉద్యోగులకు గుడ్ న్యూస్.. పీఎఫ్ కనీస పెన్షన్ రూ.7500లకు పెంపు..




ఉద్యోగం చేస్తున్న దాదాపు అందరికి పీఎఫ్ ఖాతా ఉంటుంది. పీఎఫ్ ఖాతాలోకి ప్రతి నెల ఉద్యోగి, యాజమాన్యం నిధులు జమ చేస్తోంది. ఇందులో కొంత భాగం ఎంప్లాయ్ పెన్షన్ స్కీమ్ కు జమ చేస్తారు. ఈపీఎస్ లో భాగంగా రిటైర్మెంట్ అయిన తర్వాత పెన్షన్ వస్తుంది. ఈ పెన్షన్ అనేది జమ అయిన మొత్తం ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం ఈపీఎస్ కింద కనీస పెన్షన్ రూ.1000 చెల్లిస్తున్నారు. అయితే ఇది చాలా మందికి సరిపోవడంతో రూ.1000 లతో నెల మొత్తం గడపడం కష్టంగా ఉందని చాలా మంది పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే కనీస పెన్షన్ పెంచాలని డిమాండ్ పెరుగుతోంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. నవంబరు 19న జరగనున్న ఈపీఎఫ్‌వో బోర్డు 240వ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో పెన్షన్ కనీస మొత్తం పెంపు అంశమే అజెండాగా ఈ భేటీ జరగనుందని ఈపీఎఫ్ఓ వర్గాలు అనధికారికంగా చెబుతున్నాయి. గుజరాత్‌లోని గిర్ వేదికగా జరగనున్న ఈ సమావేశం అజెండాపై అధికారిక ప్రకటన లేదు. కాగా, 2014 సెప్టెంబరు నుంచి పెన్షన్ కనీస మొత్తాన్ని కేంద్రం రూ.1000గా అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే కనీస పెన్షన్‌ను రూ.1000 నుంచి రూ.7,500కు పెంచడంతోపాటు కరువు భత్యాన్ని కూడా వర్తింప జేయాలని రిటైర్డు ఉద్యోగుల సంఘాలు, కార్మిక సంఘాలు చాలా కాలంగా డిమాండ్ చేశారు. ఉద్యోగులకు గుడ్ న్యూస్.. దీపావళికి ముందే కరువు భత్యం..! కానీ, నెలవారీ పెన్షన్ పెంపు ఆర్థికంగా చాలా భారమని కేంద్రం వాదిస్తోంది. మరోపక్క ఈపీఎఫ్‌వో తప్పనిసరి కవరేజ్ వేతన పరిమితిని కేంద్రం ఇటీవల రూ.15,000 నుంచి రూ.25,000కు పెంచింది. ఈ క్రమంలో పెన్షన్ కనీస మొత్తం పెంపు అంశం ప్రస్తుతం చర్చానీయంశంగా మారింది. కాగా ఈపీఎస్ లో భాగంగా ఎవరికి పెన్షన్ వస్తుందంటే.. ఈపీఎస్ లో 10 ఏళ్ల పాటు కంట్రీబ్యూషన్ చేయాలి. 10 ఏళ్ల పీఎఫ్ చందా చెల్లిస్తేనే పెన్షన్ కు అర్హత సాధిస్తారు. ఒక ఉద్యోగికి పెన్షన్ రావాలంటే.. అతను కనీసం 10 ఏళ్ల పాటు పెన్షనబుల్ సర్వీస్ పూర్తి చేసి ఉండాలి. అంటే 10 ఏళ్ల పాటు మీ యాజమాన్యం మీ పెన్షన్ ఖాతాకు డబ్బులు జమ చేసి ఉండాలి. ఒకవేళ మీరు మధ్యలో ఉద్యోగం మారినా పాత పీఎఫ్ ఖాతాను కొత్త కంపెనీకి బదిలీ చేసుకుంటే ఆ సర్వీస్ కాలం కూడా లెక్కిస్తారు. ఉద్యోగికి వయసు 58 ఏళ్లు నిండిన తర్వాత పెన్షన్ వస్తుంది. 10 ఏళ్ల సర్వీస్ ఉన్నప్పటికీ 58 ఏళ్లు నిండిన తర్వాతే పూర్తి పెన్షన్ వస్తుందని గుర్తుంచుకోవాలి. ఒకవేళ మీరు 50 ఏళ్లు నిండి 10 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసి ఉంటే ఎర్లీ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని నిబంధనలుచెబుతున్నాయి. అయితే 58 ఏళ్ల కంటే ముందుగా పెన్షన్ తీసుకుంటే.. ప్రతి ఏడాదికి 4% చొప్పున పెన్షన్ మొత్తంలో కోత విధిస్తారు. 58 ఏళ్ల పింఛన్ తీసుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది.

# టీ20 క్రికెట్‌లో టీమిండియా అరుదైన ఘనత.. తొలి జట్టుగా ప్రపంచ రికార్డు!

**న్యూజిలాండ్‌పై రెండో టీ20లో భారత్ ఉత్కంఠ విజయం**

**టీ20 ఫార్మాట్‌లో 200 విజయాలు అందుకున్న తొలి జట్టుగా ప్రపంచ రికార్డు**

**ఈ మ్యాచ్‌తో తన 300వ అంతర్జాతీయ టీ20 పూర్తి చేసుకున్న భారత్**



టీ20 క్రికెట్ చరిత్రలో టీమిండియా సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పింది. న్యూజిలాండ్‌తో శనివారం జరిగిన రెండో టీ20లో అద్భుత విజయం సాధించి, ఈ ఫార్మాట్‌లో 200 విజయాలు పూర్తి చేసుకున్న తొలి జట్టుగా చరిత్ర సృష్టించింది. టాప్ ఆర్డర్ విఫలమైన చోట, యువ ఆటగాళ్లు తిలక్ వర్మ, నితీశ్ రెడ్డి అసాధారణ పోరాట పటిమతో జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. ఈ మ్యాచ్ టీమిండియాకు 300వ అంతర్జాతీయ టీ20 కావడం గమనార్హం. ఇప్పటివరకు ఆడిన 300 మ్యాచ్‌లలో భారత్ 200 విజయాలు సాధించగా, 83 మ్యాచ్‌లలో ఓటమిపాలైంది. మరో 7 మ్యాచ్‌లు టైగా ముగియగా, 10 మ్యాచ్‌లు ఫలితం తేలకుండా రద్దయ్యాయి. ఈ జాబితాలో భారత్ తర్వాతి స్థానంలో పాకిస్థాన్ ఉంది. పాక్ 304 మ్యాచ్‌లలో 176 విజయాలు సాధించింది. వీరి తర్వాత న్యూజిలాండ్ (135), దక్షిణాఫ్రికా (129), ఇంగ్లండ్ (128), ఆస్ట్రేలియా (127) జట్లు ఉన్నాయి.

# భారత స్పిన్నర్ల ధాటికి జింబాబ్వే విలవిల.. మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్ విజయం



జింబాబ్వేతో జరిగిన రెండో వన్డేలో భారత మహిళల జట్టు అద్భుత ప్రదర్శనను కొనసాగించింది. హర్మన్‌ప్రీత్ కౌర్ (126), ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (106లి) అద్భుత శతకాలతో చెలరేగడం, ఆ తర్వాత బౌలర్లు రాణించడంతో భారత్ 121 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0 తేడాతో కైవసం చేసుకుంది.వడోదర వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. కెప్టెన్ స్మృతి మంధాన (0), షఫాలీ వర్మ (8) తక్కువ స్కోర్లకే పెవిలియన్ చేరడంతో 19 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన ప్రతీక రావల్ (61)తో కలిసి హర్మన్‌ప్రీత్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దింది. ఆ తర్వాత దీప్తి శర్మ జత కలవడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. హర్మన్‌ప్రీత్, దీప్తి శర్మలు జింబాబ్వే బౌలర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి శతకాలతో కదం తొక్కారు. దీంతో భారత జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 328 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది.329 పరుగుల కొండంత లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వేకు మంచి ఆరంభమే లభించింది. 20 ఓవర్లు ముగిసేసరికి ఒక వికెట్ నష్టానికి 104 పరుగులు చేసి పోరాడే సంకేతాలు ఇచ్చింది. ముపచిక్వా (49), తిరిపానో (46) రాణించారు. అయితే, ఆ తర్వాత భారత స్పిన్నర్లు విజృంభించారు. స్పిన్ త్రయం వైష్ణవి శర్మ, దీప్తి శర్మ, శ్రీ చరణి ధాటికి జింబాబ్వే బ్యాటర్లు క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయారు. వైష్ణవి శర్మ 4 వికెట్లతో చెలరేగగా, బ్యాటింగ్‌లో సెంచరీతో మెరిసిన దీప్తి శర్మ బౌలింగ్‌లోనూ 3 వికెట్లు పడగొట్టి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. దీంతో జింబాబ్వే జట్టు 48.5 ఓవర్లలో 207 పరుగులకు ఆలౌట్ అయింది.

# పండుగ వేళ లోన్ ఆఫర్ల ఎర ఉచితం అనుకుంటే బోల్తా పడటం ఖాయం!




పండుగ సీజన్ రాగానే బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు రకరకాల ఆకర్షణీయమైన ప్రకటనలతో వినియోగదారులను ముంచెత్తుతున్నాయి. 'సున్నా వడ్డీకే రుణం', 'ప్రాసెసింగ్ ఫీజు పూర్తి మినహాయింపు' అంటూ ఇస్తున్న ఆఫర్లు నిజంగానే మన సొమ్మును ఆదా చేస్తాయా లేక వినియోగదారుల జేబులకు చిల్లు పెడతాయా పండుగ వేళ కొత్త కారు, ఇల్లు లేదా ఎలక్ట్రానిక్స్ కొనుగోలు చేయడానికి రుణాలు తీసుకునే ముందు ప్రతి ఒక్కరూ నిబంధనల వెనుక ఉన్న నిజమైన ఖర్చును కచ్చితంగా అంచనా వేయాలని ఫైనాన్స్, న్యాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## జీరో ఇంటరెస్ట్ స్కీమ్‌ల వెనుక 'దాగి ఉన్న' బాదుడు

చాలామంది జీరో ఇంటరెస్ట్ అనగానే ఏ ఒక్క రూపాయి అదనంగా చెల్లించక్కర్లేదని భావిస్తారు. కానీ ఫైనాన్స్ వర్గాల సమాచారం ప్రకారం ఈ ఛార్జీలు వేరే రూపంలో దాగి ఉంటాయి. ప్రాసెసింగ్ ఫీజులు, ముందస్తు ఈఎంఐలు, అడ్వాన్స్ డౌన్ పేమెంట్లు లేదా తప్పనిసరిగా తీసుకోవాల్సిన ఇన్సూరెన్స్ ప్రీమియంల రూపంలో డబ్బులు వసూలు చేస్తారు. కాబట్టి వస్తువు అసలు నగదు ధరకు, రుణం ద్వారా చెల్లించే మొత్తం ధరకు ఉన్న తేడాను పోల్చి చూస్తేనే ఆఫర్ అసలు రంగు బయటపడుతుంది.

## పెరుగుతున్న రుణాల పరిమాణం

ట్రాన్స్‌యూనియన్ సిబిల్ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, ప్యాసింజర్ వాహనాల సగటు రుణ మొత్తం రూ. 8.2 లక్షలకు చేరింది. అదే సమయంలో ఈ రుణాలు తీర్చే వ్యవధి కూడా సగటున 62 నెలలకు పెరిగింది. ఈఎంఐ తగ్గుతోందని ఎక్కువ కాల పరిమితిని ఎంచుకుంటే, చివరకు చెల్లించే మొత్తం వడ్డీ భారం భారీగా పెరుగుతుంది. ప్రతి వ్యక్తి తన నెలవారీ చేతికి వచ్చే ఆదాయంలో లోన్ ఈఎంఐలు 40 శాతానికి మించకుండా చూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## ఆఫర్ ప్రకటనలు వేరు.. మీ చేతికి వచ్చే అగ్రిమెంట్ వేరు!

బ్యాంకులు పాంప్లెట్లలో వేసే వడ్డీ రేట్లు కేవలం అత్యుత్తమ క్రెడిట్ స్కోర్ ఉన్న కొద్దిమందికి మాత్రమే వర్తిస్తాయి. మనకు వర్తించే రేటు మన సిబిల్ స్కోర్, ఆదాయంపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి సంతకం చేసే ముందు 'కీ ఫ్యాక్ట్స్ స్టేట్‌మెంట్ (కేఎఫ్ఎస్)', 'యాన్యువల్ పర్సంటేజ్ రేట్ (ఏపీఆర్)' వంటి కీలక వివరాలను అడిగి తెలుసుకోవాలి.

## సమస్య వస్తే ఎక్కడ ఫిర్యాదు చేయాలి

ఒకవేళ ఫైనాన్స్ సంస్థలు వాగ్దానం చేసిన ఆఫర్లను అగ్రిమెంట్‌లో ఇవ్వకపోతే లేదా అదనపు ఛార్జీలు బాదితే ఊరుకోవాల్సిన అవసరం లేదు. ముందుగా సదరు డీలర్ లేదా బ్యాంకుకు రాతపూర్వకంగా కంప్లైంట్ ఇవ్వాలి. ఫలితం లేకపోతే ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్ లేదా జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్ (1915) ద్వారా న్యాయం పొందవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.



# సాయిదుర్గ తేజ్ కొత్త సినిమాలో 'కాంతార' బ్యూటీ..

## అటవీ నేపథ్యంలో భారీ యాక్షన్ డ్రామా!

మెగా సుప్రీం హీరో సాయిదుర్గా తేజ్ వరుసగా విభిన్న కథాంశాలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పలు వైవిధ్యమైన చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న ఆయన.. ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు సమాచారం. దర్శకుడు తేజ కాకుమాను తెరకెక్కించనున్న ఈ సినిమాను నిర్మాత అనిల్ సుంకర నిర్మించనున్నారు. అటవీ నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం రూపొందనుందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. సాయిదుర్గా తేజ్, తేజ కాకుమాను కాంబినేషన్‌లో రానున్న ఈ కొత్త సినిమా కథాంశంపై ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో అడవి నేపథ్యంలో సాగే సన్నివేశాలు, భారీ యాక్షన్ ఎపిసోడ్లు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని సమాచారం. గ్రాఫిక్స్, విజువల్ ఎఫెక్ట్స్‌కు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని, ఈ నెలాఖరులో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించే యోచనలో చిత్రబృందం ఉన్నట్లు సమాచారం. అయితే షూటింగ్ ప్రారంభ తేదీ, కథాంశానికి సంబంధించిన పూర్తి వివరాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ సినిమాలో సాయిదుర్గా తేజ్‌కు జోడీగా కన్నడ నటి సప్తమి గౌడ నటించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. 'కాంతార' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. ఈ సినిమాలో కథానాయికగా ఎంపికైనట్లు ప్రచారం జరుగుతోంది. అయితే చిత్రబృందం నుంచి పూర్తి క్లారిటీ రావాల్సి ఉంది. సప్తమి గౌడ గతంలో నితిన్ నటించిన 'తమ్ముడు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. అలాగే హిందీ చిత్రం 'ది వ్యాక్సిన్ వార్'లోనూ నటించారు. కన్నడ చిత్ర పరిశ్రమలో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న ఆమెకు సాయిదుర్గా తేజ్ సరసన అవకాశం వస్తే, అది ఆమె కెరీర్‌కు మరో ముఖ్యమైన ప్రాజెక్ట్‌గా నిలిచే అవకాశం ఉంది. మరోవైపు సాయిదుర్గా తేజ్ నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'సంబరాల ఏటిగట్టు'పై కూడా అంచనాలు ఉన్నాయి. రోహిత్ కేపీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ చిత్రాన్ని ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మిస్తోంది. కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.

# నవంబర్ 1న ఆర్‌సీ17 పూజా కార్యక్రమాలు

గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ మరియు క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో వస్తున్న ప్రాజెక్ట్ ఆర్‌సీ 17 ఇండస్ట్రీలో సంచలనాత్మక విజయాలను నమోదు చేసిన 'రంగస్థలం' చిత్రం తర్వాత ఈ క్రేజీ కాంబో మరోసారి రిపీట్ అవుతుండటంతో సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఈ సినిమా ఎప్పుడు ప్రారంభమవుతుందా అని మెగా అభిమానులు మరియు సినీ ప్రియులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న తరుణంలో, ఎట్టకేలకు మేకర్స్ నుంచి మోస్ట్ ఎవైటెడ్ అఫీషియల్ అప్‌డేట్ వచ్చేసింది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను మొదటగా దసరా పండుగ రోజునే అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలతో లాంచ్ చేయాలని చిత్ర యూనిట్ భావించింది. అయితే ఆ సమయంలో ముహూర్తం సరిపడకపోవడం మరియు కొన్ని సాంప్రదాయ కారణాలరీత్యా ఈ ఓపెనింగ్ కార్యక్రమాన్ని కొద్దిరోజులు వాయిదా వేయాల్సి వచ్చింది. ఆ తర్వాత అక్టోబర్ చివరి వారంలో ఈ సినిమా లాంచింగ్ ఉంటుందని మైత్రీ మూవీ మేకర్స్ సహ నిర్మాత వై.రవిశంకర్ గతంలో హింట్ ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా జరిగిన ఒక మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సినిమా పూజా కార్యక్రమాలకు సంబంధించిన ఖచ్చితమైన తేదీని అధికారికంగా రివీల్ చేశారు. వచ్చే నెల నవంబర్ 1వ తేదీన ఎంతో గ్రాండ్‌గా ఆర్‌సీ 17 పూజా కార్యక్రమాలను నిర్వహించి ఈ చిత్రాన్ని అధికారికంగా లాంచ్ చేయబోతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. కేవలం పూజతో సరిపెట్టకుండా, లాంచింగ్ పూర్తయిన వెంటనే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా రెగ్యులర్ షూటింగ్ పనులను కూడా శరవేగంగా ప్రారంభించేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. సుకుమార్ మార్క్ మేకింగ్, రామ్‌చరణ్ గ్లోబల్ ఇమేజ్ తోడవుతుండటంతో ఈ సినిమా ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాయడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఎట్టకేలకు సినిమా ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు కావడంతో మెగా అభిమానులు ప్రస్తుతం ఫుల్ ఖుష్ అవుతున్నారు మరియు సోషల్ మీడియాలో ఈ అప్‌డేట్‌ను ట్రెండ్ చేస్తున్నారు.



# సూర్య సినిమా కోసం 'కల్ట్' టైటిల్ అడిగారు.. కానీ నేను ఇవ్వలేదు విశ్వక్ సేన్



టాలీవుడ్ మాస్ కా దాస్ విశ్వక్ సేన్ తాజాగా నటిస్తూ, స్వయంగా దర్శకత్వం వహిస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ కల్ట్. ఈ సినిమా టైటిల్‌కు సంబంధించి తాజాగా ఓ ఆసక్తికరమైన వార్త టాలీవుడ్ వర్గాల్లో తెగ చక్కర్లు కొడుతోంది. కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటించబోయే ఒక భారీ సినిమా కోసం చిత్ర యూనిట్ సభ్యులు ముందుగా ఈ 'కల్ట్' టైటిల్‌ను తమకు ఇవ్వాలని అడిగినట్లు విశ్వక్ సేన్ స్వయంగా వెల్లడించారు. తమ సినిమా కథకు మరియు నేపథ్యానికి ఈ టైటిల్ అత్యంత సరిగ్గా సరిపోతుందని వారు భావించినట్లు ఆయన తెలిపారు. అయితే, ఆ టైటిల్ తన సినిమాలోని పాత్రకు, కథాంశానికి మరింత పర్ఫెక్ట్‌గా సూట్ అవుతుందని గట్టిగా నమ్మడంతో, సూర్య టీమ్ అడిగినప్పటికీ తాను ఆ టైటిల్‌ను ఇవ్వడానికి సున్నితంగా నిరాకరించినట్లు విశ్వక్ సేన్ స్పష్టం చేశారు. అయితే, అది సూర్య నటించబోయే ఏ సినిమాకు సంబంధించిన టైటిల్ అనే దానిపై మాత్రం ఆయన ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. ప్రస్తుతం ఈ ఇంట్రెస్టింగ్ మేటర్ టాలీవుడ్ మరియు కోలీవుడ్ సినీ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారగా, దీనికి సంబంధించిన చర్చలు సోషల్ మీడియాలో జోరుగా సాగుతున్నాయి.

# రాముడు, సీత ప్రేమకు సంగీత రూపం..

## 'రామాయణ' నుంచి 'రంగులు రంగులే' పాట విడుదల!



భారతీయ ఇతిహాసం 'రామాయణం' ఆధారంగా తెరకెక్కుతున్న భారీ చిత్రం నుంచి విడుదలవుతున్న ప్రతి ప్రచార చిత్రం, పాట ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. తాజాగా ఈ చిత్రం నుంచి మూడో పాటగా 'రంగులు రంగులే' విడుదలైంది. శ్రీరాముడు, సీతాదేవి మధ్య ఉన్న ప్రేమానుబంధాన్ని ఆవిష్కరిస్తూ రూపొందించిన ఈ పాట శ్రోతలను ఆకట్టుకుంటోంది. మధురమైన సంగీతం, హృద్యమైన సాహిత్యం, అందమైన దృశ్యాలతో పాటను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. ఈ పాటకు ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు. ఆయన తనదైన శైలిలో మధురమైన స్వరాలను, ఆకట్టుకునే సంగీత వాయిద్యాలను మేళవించి పాటను రూపొందించారు. గేయ రచయిత రాకేందు మౌళి అందించిన సాహిత్యం రాముడు, సీతల మధ్య ఉన్న అనుబంధాన్ని, వారి భావోద్వేగాలను ప్రతిబింబించేలా ఉంది. రాఘవ్ కౌశిక్, వైశాలి సామంత్ తమ స్వరాలతో పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చారు. 'రంగులు రంగులే' పాటలో రాముడు, సీతల జీవిత ప్రయాణంలోని కీలక ఘట్టాలను చూపించారు. స్వయంవరంలో తొలిసారి కలుసుకోవడం, ఆ తర్వాత వివాహ బంధంతో ఒక్కటవడం, అయోధ్యలో కలిసి గడిపిన మధుర క్షణాలు, అరణ్యవాసానికి బయలుదేరడం వంటి సన్నివేశాలు పాటలో కనిపిస్తాయి. ఈ దృశ్యాల ద్వారా వారి ప్రేమలోని ఆప్యాయత, పరస్పర అనుబంధం, జీవితంలో ఎదురైన కీలక మలుపులను చూపించే ప్రయత్నం చేశారు. రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతాదేవిగా సాయి పల్లవి నటిస్తున్నారు. వీరిద్దరూ తెరపై కనిపించే తీరు, పాత్రలకు అనుగుణంగా వారి హావభావాలు ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. భారీ స్థాయిలో రూపొందుతున్న 'రామాయణ'ను రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. మొదటి భాగాన్ని నవంబరు 5న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. తాజాగా విడుదలైన 'రంగులు రంగులే' పాట రాముడు, సీతల ప్రేమకథను సంగీత రూపంలో ఆవిష్కరించడంతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది.

PUBLISHED AND OWNER BY LINGALA NARENDER Published at 10-1-1-/A, THIRIMURTHY COLONY,PRIYADARSHINI PARK BESIDE,SAROOR NAGAR,RANGAREDDY District TELANGANA - 500035. Printed at SMILYSONLINE 6-7-48,VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY District,TELANGANA - 500070. EDITOR LINGALA NARENDER RNI NO. : TGTEL/25/A0357 ,CELL : 9010880040